www.udyamakeratam.com
PRGI No. : TGTEL/25/A0273

1 వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షితః UDYAMA KERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 96 | 22-9-2026 | మంగళవారం | పేజీలు: 8 | వెల : రూ.2/- |

# ట్యాంక్‌బండ్‌పై మళ్లీ ఉద్రిక్తత



- హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనానికి బారికేడ్లు తొలగించిన ఉత్సవ సమితి
- పోలీసుల ఆంక్షలను వ్యతిరేకించిన భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి
- సంప్రదాయ నిమజ్జనాన్ని అడ్డుకోవడం సరికాదని నేతల ఆగ్రహం
- కాలుష్య నియంత్రణ కోసం ట్యాంక్‌బండ్‌పై పీవోపీ విగ్రహాల నిమజ్జనానికి ఆంక్షలు
- పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు భారీగా పోలీసుల మోహరింపు

వినాయక నిమజ్జనోత్సవాల వేళ ట్యాంక్‌బండ్‌పై మరోసారి ఉద్రిక్తత నెలకొంది. హుస్సేన్‌సాగర్‌లో విగ్రహాల నిమజ్జనాన్ని అడ్డుకునేందుకు పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన ఇనుప బారికేడ్లను భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు తొలగించారు.

వివరాలు 2వ పేజీలో

# డ్రగ్స్‌పై దేశవ్యాప్త ఉక్కుపాదం

- ఢిల్లీలో మూడో జాతీయ ఏఎన్‌టీఎఫ్ సదస్సు
- నేడు ప్రారంభించనున్న అమిత్ షా
- 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల చీఫ్‌ల హాజరు
- డ్రగ్ కార్టెల్స్ ఛేదింపుపై ప్రత్యేక దృష్టి
- డార్క్‌నెట్, క్రిప్టో లావాదేవీలపైనా చర్చ

4





# సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.813 కోట్లు

## పరిహారం చెల్లింపుల్లో జాప్యం వద్దు

- మార్కెట్ విలువకు చేరువగా పరిహారం ఉండాలి
- యుద్ధప్రాతిపదికన పంపిణీకి ఉత్తమ్ ఆదేశం
- భూసేకరణకు రూ.6 వేల కోట్లపై సీఎం హామీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (ఉద్యమ కెరటం):** సాగునీటి ప్రాజెక్టుల కోసం భూములు ఇచ్చిన రైతులకు చెల్లించాల్సిన పరిహారాన్ని ఏమాత్రం ఆలస్యం చేయకుండా అందించాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణ, పునరావాసం-పునర్వ్యవస్థీకరణ కోసం ఇప్పటికే విడుదలైన నిధుల్లో జిల్లా స్థాయిలో పెండింగ్‌లో ఉన్న రూ.813 కోట్లను యుద్ధప్రాతిపదికన రైతుల చేతికి చేర్చాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఖాతాల్లో డబ్బు ఉండి.. పరిహారం అందక ప్రాజెక్టుల పనులు నిలిచిపోవడాన్ని సహించబోమని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూసేకరణ, పరిహారం చెల్లింపుల పురోగతిని ఉత్తమ్ సమీక్షించారు. ఏప్రిల్ 1 నుంచి భూసేకరణ, పునరావాసానికి సంబంధించి సుమారు రూ.3,101 కోట్ల విలువైన టోకెన్లు సమర్పించగా, రూ.2,504 కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు అధికారులు వివరించారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న మొత్తంలో భూసేకరణ అధికారుల వద్ద రూ.502 కోట్లు, కలెక్టర్ల వద్ద రూ.311 కోట్లు ఉన్నట్లు సమావేశంలో వెల్లడైంది. భూములు కోల్పోయిన రైతులకు నిధులు చేరకుండా ప్రభుత్వ ఖాతాల్లోనే ఉండిపోవడం ఆందోళనకరమని ఉత్తమ్

వివరాలు 2లో..

## ఎల్‌నినో యాక్షన్ ప్లాన్‌పై అక్టోబర్ 2న తీర్మానాలు



- ప్రతి గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దాలి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క


2

# ఖరీదైన ప్రాంతాల్లోనే పేదలకు ఇల్లు

## వచ్చే బోనాల నాటికి లబ్ధిదారులతో బోనాలు ఎత్తిస్తాం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక..
- ఉచితంగా రిజిస్ట్రేషన్ హక్కులు
- రాయదుర్గంలో ఇండ్ల టవర్స్‌కు శంకుస్థాపన

2




హైదరాబాద్ మహానగరంలోని 'క్యూర్' పరిధిలో నివసిస్తున్న పట్టణ పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని రాయదుర్గం మల్కం చెరువు సమీపంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణ పనులకు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమ వారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు పత్రాలను ఆయన పంపిణీ చేశారు.

2

# బాలికపై వేధింపులు ముగ్గురి అరెస్టు

- పదో తరగతి విద్యార్థులకు వేధింపులు
- వైరల్ వీడియోతో రంగంలోకి దిగిన పోలీసులు
- పోక్సో సహా పలు సెక్షన్ల కింద కేసు
- ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు
- కఠిన చర్యలు తీసుకోవాలన్న రాహుల్ గాంధీ

4






3

# జూరాల ఎడమ కాలువ వద్ద ఉద్రిక్తత

## పోలీసుల లాఠీఛార్జ్, మాజీ ఎమ్మెల్యే చిట్టెం అరెస్టు


పంటలను కాపాడుకునేందుకు కాలువలోకి దిగి రైతుల ఆందోళన

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా సాగునీటి పోరాటం

# 22ఏ నిషేధిత జాబితా వివాదం

- ప్రభుత్వానికి ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు
- ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చడంపై స్వతంత్ర విచారణకు ఆదేశం
- నాలుగు వారాల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని సీఎస్‌కు స్పష్టీకరణ

2







# మూసీలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

విద్యార్థులకు తప్పిన ముప్పు

2

# రామ మందిర విరాళాల చోరీ నిందితుల గుర్తింపు

- దర్యాప్తు దాదాపు పూర్తి చేసిన సిట్
- 25లోగా తొలి చార్జిషీట్ దాఖలు
- సీసీటీవీలో 105 చోరీ ఘటనలు
- ఇప్పటికేఎనిమిది మంది అరెస్టు

4



ఉద్యమ కెరటం
విరామ రక్షణ రక్షిత UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

మంగళవారం
22 సెప్టెంబర్ 2026



# ట్యాంక్‌బండ్‌పై మళ్లీ ఉద్రిక్తత

## హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనానికి బారికేడ్లు తొలగించిన ఉత్సవ సమితి

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (ఉద్యమ కెరటం):** వినాయక నిమజ్జనోత్సవాల వేళ ట్యాంక్‌బండ్‌పై మరోసారి ఉద్రిక్తత నెలకొంది. హుస్సేన్‌సాగర్‌లో విగ్రహాల నిమజ్జనాన్ని అడ్డుకునేందుకు పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన ఇనుప బారికేడ్లను భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు తొలగించారు. అనంతరం శోభాయాత్రగా వచ్చిన పలువురు హుస్సేన్‌సాగర్‌లో విగ్రహాలను నిమజ్జనం చేయడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. శతాబ్దాలుగా కొనసాగుతున్న నిమజ్జన సంప్రదాయాన్ని నిలిపివేయడం ద్వారా భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిమజ్జనానికి అడ్డుగా ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్, బారికేడ్లను తొలగించారు. నిమజ్జనోత్సవాల చివరి ఘట్టం సజావుగా సాగేందుకు ట్యాంక్‌బండ్‌పై ఆంక్షలను ఎత్తివేసి వాహనాలను అనుమతించాలని డిమాండ్ చేశారు. హుస్సేన్‌సాగర్‌లో కాలుష్యాన్ని తగ్గించేందుకు తెలంగాణ హైకోర్టు గతంలో పలు ఆదేశాలు జారీ చేసింది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనం చేయకుండా చర్యలు తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలకు మాత్రమే అనుమతి ఇవ్వాలని స్పష్టం చేసింది. ఇతర విగ్రహాలను బేబీ పాండ్స్, ఎన్టీఆర్ మార్గ్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నిమజ్జన కేంద్రాల వైపు తరలించాలని సూచించింది. ఈ నేపథ్యంలోనే ట్యాంక్‌బండ్ ప్రధాన రహదారి నుంచి హుస్సేన్‌సాగర్‌లోకి విగ్రహాలను తీసుకెళ్లకుండా అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఉత్సవ సమితి నేతలు బారికేడ్లను తొలగించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో పాటు అదనపు పోలీసు బలగాలను మోహరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. కోర్టు ఆదేశాలు, ప్రభుత్వ సూచనలను పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించవద్దని పోలీసులు ఉత్సవ సమితి నేతలకు సూచించారు.

# ఎల్‌నినో యాక్షన్ ప్లాన్‌పై అక్టోబర్ 2న తీర్మానాలు

## ప్రతి గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

## పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (ఉద్యమ కెరటం):** ఎల్‌నినో ప్రభావంతో రానున్న కాలంలో ఎదురయ్యే పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు గ్రామస్థాయిలో పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అక్టోబర్ 2న నిర్వహించనున్న గ్రామ సభలు, ఎల్‌నినో నేపథ్యంలో గ్రామాల వారీగా చేపట్టాల్సిన పనులు, పంచాయతీల్లో అమలు చేయాల్సిన అభివృద్ధి ప్రణాళికపై మంత్రి సమీక్షించారు. సమావేశానికి స్పెషల్ సీఎస్ దానకిషోర్, అడిషనల్ కమిషనర్ పి.రవీందర్‌తోపాటు శాఖకు చెందిన ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని యాక్షన్ ప్లాన్‌పై అసెంబ్లీలో చర్చించి తీర్మానం చేశామని చెప్పారు. అక్టోబర్ 2న ప్రతి గ్రామ పంచాయతీలో నిర్వహించే గ్రామ సభల్లో ఎల్‌నినో యాక్షన్ ప్లాన్‌పై చర్చించి గ్రామస్థాయిలో అవసరమైన చర్యలపై తీర్మానాలు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామానికి అవసరమైన పనులు ఏమిటి.. అందుబాటులో ఉన్న నిధులు ఎంత.. వచ్చే ఏడాది కాలంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా గ్రామ పంచాయతీలకు అందే నిధులు ఎంత అనే అంశాలపై గ్రామ సభల్లో సమగ్రంగా చర్చించి గ్రామ అవసరాలకు అనుగుణంగా కార్యాచరణను ఆమోదించాలని మంత్రి సూచించారు.

# మూసీలోకి దూసుకెళ్లిన బస్సు




**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (ఉద్యమ కెరటం) :** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో స్కూల్ బస్సు అదుపుతప్పి మూసీ నదిలోకి దూసుకెళ్లిన సంఘటన సోమవారం జరిగింది. దీంతో బస్సులోని చిన్నారులు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. త్రుటిలో పెను ప్రమాదం తప్పడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, సంబంధిత అధికారులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. స్కూల్ బస్సు రోడ్డుపై నుంచి అదుపుతప్పి మూసీ నదిలోకి దూసుకెళ్లడంతో ఆ మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. బస్సును అక్కడి నుంచి తొలగించేందుకు చర్యలు చేపట్టడంతోపాటు ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యమా లేక మరేదైనా కారణమా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

# సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.813 కోట్లు

మొదటి పేజీ తరువాయి

పేర్కొన్నారు. కలెక్టర్లు వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని చర్చలు వేగవంతం చేసి అవార్డులు, పరిహారం చెల్లింపులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఏదైనా వాస్తవమైన కారణంతో నిధులు చెల్లించలేని పరిస్థితి ఉంటే కారణాన్ని వివరించి డబ్బును తిరిగి ప్రభుత్వానికి పంపాలని, ఖాతాల్లో నిరుపయోగంగా ఉంచవద్దని స్పష్టం చేశారు. 2026లో సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, పునరావాసం, అటవీ సంబంధిత అవసరాల కోసం రూ.6 వేల కోట్లు సమకూర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని ఉత్తమ్ తెలిపారు. ప్రాధాన్య ప్రాజెక్టులకు నిధుల కొరత అడ్డంకి కాకుండా సాధారణ నీటిపారుదల బడ్జెట్‌కు వెలుపల నుంచి ఈ నిధులను సమకూరుస్తున్నట్లు వివరించారు.

### రైతులకు అన్యాయం జరగొద్దు

భూసేకరణలో రైతుల పట్ల మానవీయంగా వ్యవహరించాలని ఉత్తమ్ స్పష్టం చేశారు. అవార్డులు ఖరారై, చెల్లింపులకు సిద్ధంగా ఉన్న కేసుల్లోనే టోకెన్లు రూపొందించాలని సూచించారు. చట్టపరమైన నిబంధనలు, ప్రక్రియలకు లోబడి రైతులకు ఇచ్చే పరిహారం సాధ్యమైనంత



వరకు ప్రస్తుత మార్కెట్ విలువకు చేరువగా ఉండాలని చెప్పారు. అవార్డు తర్వాత కూడా పరిహారం చెల్లించని కేసుల్లో నిబంధనల ప్రకారం వర్తించే వడ్డీని చెల్లించాలని ఆదేశించారు. కోర్టు, యాజమాన్య వివాదాల్లో ఉన్న కేసులన్నింటినీ క్రోడీకరించి అడ్వకేట్ జనరల్ ద్వారా పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. నల్లగొండ, యాదాద్రి భువనగిరి, నారాయణపేట, సిద్దిపేట, వికారాబాద్, జగిత్యాల, హనుమకొండ సహా పలు జిల్లాల్లో భూసేకరణకు ఎదురవుతున్న అడ్డంకులను మంత్రి సమీక్షించారు. నల్లగొండ జిల్లాలో చింతపల్లి రిజర్వాయర్, పెండ్లిపాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఉదయసముద్రం, నెల్లికల్లు పనుల పురోగతిపై ఆరా తీశారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తయినా పెండ్లిపాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు అవసరమైన భూసేకరణ పూర్తికాకపోతే పెట్టుబడుల ప్రయోజనం అందదని హెచ్చరించారు. పలు సాగునీటి ప్రాజెక్టులు ఇప్పటికే గణనీయంగా పూర్తయినా డిస్ట్రిబ్యూటరీ కాలువలు, అనుసంధాన పనులు, కొద్దిపాటి భూసేకరణ పెండింగ్‌తో వాటి ఫలాలు రైతులకు అందడం లేదని ఉత్తమ్ పేర్కొన్నారు. రెండు, మూడు వారాలు సాధారణ పరిపాలనా సమయమంటూ జాప్యం చేయకుండా గడువులను కుదించి పనులు పూర్తి చేయాలని కలెక్టర్లకు సూచించారు. నిధుల అవసరం ఉన్నప్పుడు, చెల్లింపులకు కేసులు సిద్ధమైన తర్వాతే కోరాలని.. ప్రభుత్వ సొమ్ము ఖాతాల్లో నిరుపయోగంగా ఉండకుండా ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ సుల్తానియా, భూసేకరణ కమిషనర్ శివకుమార్ నాయుడు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

# ఖరీదైన ప్రాంతాల్లోనే పేదలకు ఇల్లు

- వచ్చే బోనాల నాటికి లబ్ధిదారులతో బోనాలు ఎత్తిస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక..
- ఉచితంగా రిజిస్ట్రేషన్ హక్కులు
- రాయదుర్గంలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు శంకుస్థాపన
- తొలి విడతలో ఒక్కో నియోజకవర్గానికి 480 ఇళ్లు



**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (ఉద్యమ కెరటం):** హైదరాబాద్ మహానగరంలోని పట్టణ పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని రాయదుర్గం-మల్కం చెరువు సమీపంలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. పట్టణ పేదలను నగరానికి దూరంగా పంపకుండా వారు నివసిస్తున్న ప్రాంతాలకు సాధ్యమైనంత దగ్గరలోనే సొంతింటిని అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. పేదవాడి సొంతింటి కల అంటే కేవలం నాలుగు గోడలు, పైకప్పు కాదని.. ఆత్మగౌరవంతో జీవించే చిరునామా కల్పించడమే ఇందిరమ్మ టవర్స్ లక్ష్యమని పొంగులేటి చెప్పారు. హైదరాబాద్‌లో భూముల ధరలు అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లోనే పేదలకు ఇళ్లు నిర్మించి భద్రత, భరోసా కల్పిస్తున్నామన్నారు. రాయదుర్గం ప్రాజెక్టును 2.85 ఎకరాల విస్తీర్ణంలో చేపడుతున్నట్లు వెల్లడైంది. ఇందిరమ్మ టవర్స్‌లో ఇల్లు పొందే ప్రతి కుటుంబానికి అపార్ట్‌మెంట్‌పై పూర్తి హక్కులతోపాటు 17 నుంచి 20 గజాల వరకు అవిభాజ్య భూవాటా కల్పిస్తామని మంత్రి తెలిపారు. సేల్‌డీడ్‌ను రిజిస్ట్రేషన్ చార్జీలు లేకుండా అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. ఇది కేవలం నివాసం మాత్రమే కాదని, పిల్లలకు, భవిష్యత్ తరాలకు మిగిలే ఆస్తి అని పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం, పైరవీలకు అవకాశం ఉండదని పొంగులేటి స్పష్టం చేశారు. అర్హత ఆధారంగా లాటరీ పద్ధతిలో పారదర్శకంగా ఎంపిక చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ హౌసింగ్ బోర్డు లాటరీ ఎంపికలను బహిరంగంగా ప్రకటించి అభ్యంతరాలు స్వీకరించే విధానాన్ని అమలు చేస్తోందన్నారు. తొలి విడతలో ఒక్కో నియోజకవర్గంలో 480 ఇళ్ల చొప్పున నిర్మాణాలు చేపడుతున్నామని, పలుచోట్ల టెండర్లు, ఒప్పంద ప్రక్రియలు ఇప్పటికే పూర్తయ్యాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో తొలి దశలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని, రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. హైదరాబాద్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా టవర్స్ కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. రాబోయే రెండున్నరేళ్లలో 'క్యూర్' ప్రాంతంలోని అర్హులైన పేదలకు రెండో, మూడో, నాలుగో, ఐదో విడతలుగా ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. రాయదుర్గం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి వచ్చే బోనాల నాటికి ఇక్కడి నుంచే లబ్ధిదారులతో బోనాలు ఎత్తించేలా పనులు చేపడతామని పొంగులేటి చెప్పారు. నిర్మాణ నాణ్యతలో రాజీపడబోమని స్పష్టం చేశారు. లబ్ధిదారులు వారానికి ఒకసారి వచ్చి తమ ఇళ్ల నిర్మాణాన్ని స్వయంగా పరిశీలించవచ్చని, లోపాలు కనిపిస్తే అక్కడే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. వాటిని పరిష్కరించే బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. గతంలో పేదలకు నగరానికి 30-40 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు నిర్మించారని పొంగులేటి విమర్శించారు. తమ ప్రభుత్వం మాత్రం ఖరీదైన ప్రాంతాల్లోనే పేదలకు సొంతింటి హక్కు కల్పిస్తోందన్నారు. పేదల ఇళ్ల కార్యక్రమాన్ని రాజకీయ విమర్శలకు ఉపయోగించడం సరికాదని, గత ప్రభుత్వ హామీలు, అమలుపై ప్రజలే నిర్ణయం తీసుకున్నారని వ్యాఖ్యానించారు.

# 22ఏ నిషేధిత జాబితా వివాదం

## తెలంగాణ ప్రభుత్వానికి ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు

## ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చడంపై స్వతంత్ర విచారణకు ఆదేశం

## నాలుగు వారాల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని సీఎస్‌కు స్పష్టీకరణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (ఉద్యమ కెరటం):** తెలంగాణలో రిజిస్ట్రేషన్ చట్టం పరిధిలోని '22ఏ' నిషేధిత జాబితాలో ప్రైవేట్ వ్యక్తుల భూములను, పట్టా స్థలాలను చేర్చిన వ్యవహారంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ అంశంపై తక్షణమే స్వతంత్ర విచారణ చేపట్టి, బాధితులకు ఉపశమనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సోమవారం ఆదేశించింది. విచారణ పురోగతి, తీసుకున్న చర్యలపై నాలుగు వారాల్లోగా సమగ్ర నివేదికను సమర్పించాలని స్పష్టం చేసింది.

### రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనపై ఫిర్యాదు:

హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది, సామాజికవేత్త కారు-పోతుల రేవంత్ సెప్టెంబర్ 14న దాఖలు చేసిన ఫిర్యాదుపై ఎన్‌హెచ్‌ఆర్సీ స్పందించింది. ధరణి పోర్టల్ నుంచి నూతన 'భూ భారతి' విధానానికి మార్పు చెందే క్రమంలో, ఎలాంటి ముందస్తు నోటీసులు లేదా గెజిట్ నోటిఫికేషన్లు లేకుండానే లక్షలాది ప్రైవేట్ పట్టా భూములను అధికారులు ఏకపక్షంగా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. దీనివల్ల ఆస్తుల రిజిస్ట్రేషన్లు, బ్యాంక్ రుణాలు, భూ లావాదేవీలు నిలిచిపోయి సామాన్య ప్రజలు తీవ్ర ఆర్థిక నష్టంతో పాటు మానసిక క్షోభ అనుభవిస్తున్నారని ఎన్‌హెచ్‌ఆర్సీ దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదును పరిశీలించిన కమిషన్.. ప్రజల జీవించే హక్కు (ఆర్టికల్ 21), సమానత్వ హక్కు (ఆర్టికల్ 14), వృత్తి-వ్యాపార నిర్వహణ హక్కు ఄఆర్టికల్ 19(1)(జీ)ఞ మరియు ఆస్తి హక్కు (ఆర్టికల్ 300-ఏ) వంటి ప్రాథమిక, రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన కోణంలో ఈ విషయాన్ని




తీవ్రంగా పరిగణించింది. ప్రైవేట్ వ్యక్తుల భూములు ఈ నిషేధిత జాబితాలోకి ఎలా వచ్చాయి? నిర్ణయాత్మక ప్రక్రియలో అధికారుల వైపు నుంచి ఏమైనా లోపాలు లేదా అక్రమాలు చోటుచేసుకున్నాయా? అనే అంశాలపై నిష్పాక్షికంగా విచారణ జరపాలని ఎన్‌హెచ్‌ఆర్సీ ఆదేశించింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 22ఏ సమస్యల పరిష్కారానికి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి, జిల్లాల కలెక్టర్లకు దిశానిర్దేశం చేసినప్పటికీ, తాజా ఎన్‌హెచ్‌ఆర్సీ ఆదేశాలతో ఈ ప్రక్రియపై తక్షణ విచారణ నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ట్యాంక్‌బండ్‌పై మళ్లీ ఉద్రిక్తత

## హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనానికి బారికేడ్లు తొలగించిన ఉత్సవ సమితి

## పోలీసుల ఆంక్షలను వ్యతిరేకించిన భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి



**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (ఉద్యమ కెరటం):** వినాయక నిమజ్జనోత్సవాల వేళ ట్యాంక్‌బండ్‌పై మరోసారి ఉద్రిక్తత నెలకొంది. హుస్సేన్‌సాగర్‌లో విగ్రహాల నిమజ్జనాన్ని అడ్డుకునేందుకు పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన ఇనుప బారికేడ్లను భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు తొలగించారు. అనంతరం శోభాయాత్రగా వచ్చిన పలువురు హుస్సేన్‌సాగర్‌లో విగ్రహాలను నిమజ్జనం చేయడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. శతాబ్దాలుగా కొనసాగుతున్న నిమజ్జన సంప్రదాయాన్ని నిలిపివేయడం ద్వారా భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిమజ్జనానికి అడ్డుగా ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్, బారికేడ్లను తొలగించారు. నిమజ్జనోత్సవాల చివరి ఘట్టం సజావుగా సాగేందుకు ట్యాంక్‌బండ్‌పై ఆంక్షలను ఎత్తివేసి వాహనాలను అనుమతించాలని డిమాండ్ చేశారు. హుస్సేన్‌సాగర్‌లో కాలుష్యాన్ని తగ్గించేందుకు తెలంగాణ హైకోర్టు గతంలో పలు ఆదేశాలు జారీ చేసింది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనం చేయకుండా చర్యలు తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలకు మాత్రమే అనుమతి ఇవ్వాలని స్పష్టం చేసింది. ఇతర విగ్రహాలను బేబీ పాండ్స్, ఎన్టీఆర్ మార్గ్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నిమజ్జన కేంద్రాల వైపు తరలించాలని సూచించింది. ఈ నేపథ్యంలోనే ట్యాంక్‌బండ్ ప్రధాన రహదారి నుంచి హుస్సేన్‌సాగర్‌లోకి విగ్రహాలను తీసుకెళ్లకుండా అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఉత్సవ సమితి నేతలు బారికేడ్లను తొలగించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో పాటు అదనపు పోలీసు బలగాలను మోహరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. కోర్టు ఆదేశాలు, ప్రభుత్వ సూచనలను పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించవద్దని పోలీసులు ఉత్సవ సమితి నేతలకు సూచించారు.

# జూరాల ఎడమ కాలువ వద్ద ఉద్రిక్తత

- పోలీసుల లాఠీఛార్జ్, మాజీ ఎమ్మెల్యే చిట్టెం అరెస్టు
- ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు కాలువలోకి దిగి రైతుల ఆందోళన
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా సాగునీటి పోరాటం






**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 21 (ఉద్యమ కెరటం):** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సాగునీటి కోసం అన్నదాతలు చేస్తున్న పోరాటం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఎండిపోతున్న పంటలను కాపాడుకోవడానికి జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువకు వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు చేపట్టిన ఆందోళన మంగళవారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. అమరచింత మండల పరిధిలోని జూరాల ఎడమ కాలువ వద్దకు రైతులు చేరుకోకుండా పోలీసులు భారీగా మోహరించి అడుగడుగునా అడ్డుకున్నారు.

## పోలీసుల లాఠీఛార్జ్ - మాజీ ఎమ్మెల్యే అరెస్టు

రైతుల నిరసనకు మద్దతుగా జూరాల ప్రాజెక్టు వద్దకు చేరుకున్న మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డిని పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర తోపులాట జరిగింది. పోలీసులు చిట్టెం రాంమోహన్ రెడ్డిని ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో ఆగ్రహించిన రైతులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పరిస్థితి చేయిదాటింది. పోలీసులు ప్రధాన రహదారులపై అడ్డంకులు ఏర్పాటు చేసినప్పటికీ, అన్నదాతలు పొలాల వెంబడి కిలోమీటర్ల మేర నడుచుకుంటూ ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు.

## ప్రాణాలను తెగించి కాలువలోకి దిగిన రైతులు

పంట పొలాలకు నీళ్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పలువురు రైతులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సమాంతర కాలువలోకి దిగి, జూరాల ఎడమ కాలువ రెగ్యులేటర్ వైపు నడుచుకుంటూ వెళ్లేందుకు ప్రయత్నించడం స్థానికులను తీవ్రంగా కలచివేసింది. ఆందోళన తీవ్రతరం కావడంతో రక్షణ చర్యల్లో భాగంగా పోలీస్ బలగాలు జూరాల ప్రాజెక్టును పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఆందోళనలకు పిలుపునిచ్చిన ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలను జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడే ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

## జిల్లా వ్యాప్తంగా పతాక స్థాయికి చేరిన నిరసనలు

ఒక్క జూరాల మాత్రమే కాకుండా కోయిల్ సాగర్, సంగంబండ రిజర్వాయర్ల కాలువలకు కూడా వెంటనే సాగునీరు విడుదల చేయాలని రైతులు పట్టుబడుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో దాదాపు 100 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎత్తిపోయకపోవడం వల్ల ఆ నీరంతా దిగువన ఆంధ్ర ప్రాంతానికి తరలిపోతోందని, స్థానిక రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆందోళనకారులు మండిపడుతున్నారు. ఇరిగేషన్ అధికారులు తక్షణమే స్పందించి సాగునీటి విడుదలపై స్పష్టమైన ప్రకటన చేయకపోతే ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని రైతాంగం హెచ్చరించింది.

# ఉత్సవ సమితి సభ్యుల అరెస్టు దుర్మార్గం

- వినాయక నిమజ్జనం సమస్యను పరిష్కరించాలి
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21 (ఉద్యమ కెరటం) :** హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనం ఏర్పాట్లను పెంచాలని డిమాండ్ చేస్తున్న భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి పదాధికారులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. గణేశ్ నిమజ్జనానికి సంబంధించిన సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఉత్సవ సమితి సభ్యులను అరెస్టు చేయడం దుర్గార్గమన్నారు. భాగ్యనగరంలో గణేశ్ ఉత్సవాల నిర్వహణ మొదలుకుని నిమజ్జనం వరకు క్రమశిక్షణతో కూడిన వ్యవస్థను ఏర్పాటు చేయడంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి 47 ఏళ్లుగా కీలకపాత్ర పోషిస్తోందని తెలిపారు. ప్రభుత్వానికి, పోలీసులకు, వివిధ శాఖలకు సహకరిస్తూ లక్షలాది మంది భక్తులు పాల్గొనే నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు పనిచేస్తోందన్నారు. ఈసారి కూడా నగరవ్యాప్తంగా దాదాపు 1,40,000 గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించారని తెలిపారు. ఈనెల 25న జరిగే ప్రధాన నిమజ్జనోత్సవానికి లక్షలా మంది భక్తులు తరలివస్తారని, ఇంతటి భారీ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై ప్రభుత్వం చాలా ముందుగానే స్పష్టత ఇవ్వాల్సి ఉందని అన్నారు. ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనానికి సంబంధించిన అంశాన్ని గణేశ్ ఉత్సవ సమితి ముందుగానే ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లిందని, అయినా ప్రభుత్వం సరైన సమయంలో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపడంలో విఫలమైందని విమర్శించారు. న్యాయపరమైన అంశాలు ఉన్నప్పుడు వాటిని ముందుగానే పరిశీలించి చట్టపరిధిలో ఏం చేయవచ్చో నిర్ణయించి, ఉత్సవ సమితితో చర్చించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. కానీ నిమజ్జనోత్సవానికి కొద్ది రోజుల ముందు ఆంక్షలు విధించడం సమస్యకు పరిష్కారం కాదన్నారు. పెద్ద సంఖ్యలో, భారీ విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన క్రేన్లు, ట్రాఫిక్ నిర్వహణ, శాంతిభద్రతల అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. భక్తుల మనోభావాలను గౌరవించాలని, ఉత్సవ సమితితో ఘర్షణకు దిగడం, అరెస్టులతో సమస్యను అణచివేయాలని చూడడం సరైన విధానం కాదని హితవు పలికారు. ప్రభుత్వం పరిస్థితిని జఠిలం చేసేలా వ్యవహరించకూడదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరిని వీడి భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులతో వెంటనే చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. న్యాయపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుంటూనే భక్తుల మనోభావాలను గౌరవిస్తూ భారీ విగ్రహాల నిమజ్జనానికి ఆచరణాత్మకమైన ఏర్పాట్లు చేయాలన్నారు. గణేశ్ నిమజ్జనోత్సవం ప్రశాంతంగా, సజావుగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తయ్యేలా ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కిషన్‌రెడ్డి కోరారు.

# ఎర్రవల్లిలో కొనసాగిన భూ సర్వే

- పాస్ పుస్తకాలు, నోటీసులతో రైతుల హాజరు
- సర్వే నంబర్ 325లో కొనసాగుతున్న సమగ్ర భూ కొలతలు
- పాండురంగ చెరువు నిర్మాణంతో భూమి కోల్పోయామంటున్న బాధితులు
- న్యాయం చేయాలని వేడుకోలు
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ శమీనా బేగం



**మర్కుక్, సెప్టెంబర్ 21 (ఉద్యమ కెరటం) :** మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో సర్వే నంబర్ 325లో గల 388.05 గుంటల ప్రభుత్వ భూమిపై చేపట్టిన సమగ్ర భూ సర్వే సోమవారం కూడా కొనసాగింది.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం,రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఎర్రవల్లి గ్రామంలో సర్వే నంబర్ 325లో సాగు చేస్తున్న వంద మంది రైతులకు తొలి విడత నోటీసులు జారీ చేసి,సోమవారం తమ భూముల హద్దులు చూపించాలని ఆదేశించడంతో రైతులు ఉదయం నుంచే తమ పట్టాదార్ పాస్ బుక్ లు నోటీసులు,ఇతర రెవెన్యూ రికార్డులతో తమ భూముల వద్దకు చేరుకున్నారు.ఏడీ సుదర్శన్ రాథోడ్,డీఐ సేవ్య నాయక్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలుగా ఏర్పడిన సర్వే అధికారులు రైతులు చూపిస్తున్న హద్దుల ప్రకారం,రెవెన్యూ రికార్డుల ప్రకారం కొలతలు చేపట్టి వివరాలను నమోదు చేశారు.సోమవారం నాటికి సుమారు 70ఎకరాల వరకు సర్వే పూర్తి అయినట్లు అధికారులు తెలిపారు.ఎర్రవల్లి గ్రామంలో కొనసాగుతున్న సర్వేను రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ శమీనా బేగం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె సర్వే పనులు జరుగుతున్న తీరును,భూముల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా కచ్చితమైన కొలతలతో,పారదర్శకంగా నిర్వహించాలని ఆమె అధికారులకు సూచించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని,అందరికీ న్యాయం జరిగేలా సర్వే చేయాలని ఆమె ఆదేశించారు.అలాగే సోమవారం రోజున మరో 50 మంది రైతులకు నోటీసులు జారీ చేశామని అధికారులు తెలిపారు. గత మూడు రోజులుగా ఈ భూమికి హద్దులు ఏర్పాటు చేస్తున్న అధికారులు ప్రస్తుతం ఎవరి భూమి ఎంత ఉంది, ఎంత ఆక్రమణలో ఉంది.. ఎంత ఖాళీగా ఉంది అనే అంశాలపై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తున్నారు. కాగా, ఈ సర్వేలో రైతుల ఆవేదన కూడా బయటపడింది. ఇదే సర్వే నంబర్ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా పాండురంగ చెరువును నిర్మించారని, ఆ చెరువు నిర్మాణంలో రైతులు ఏళ్లుగా సాగు చేసుకుంటున్న దాదాపు 80 ఎకరాల సాగు భూమి పూర్తిగా కోల్పోయామని రైతులు వాపోతున్నారు. తద్వారా పండించుకునే భూమే లేకుండా పోయిందని.. ఇప్పుడు అదే భూములకు తమకు నోటీసులు రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని అంటున్నారు. 'మా భూమి అంతా పాండురంగ చెరువులో పోయింది.. ఇప్పుడు మాకు నోటీసులు వచ్చాయి.. భూమే లేనప్పుడు మేము అధికారులకు ఏ భూమి చూపించాలం'టూ కొంతమంది రైతులు అధికారులను, సర్వేయర్లను ప్రశ్నిస్తున్నారు. శనివారం నోటీసులు అందుకుని సోమవారం పొలాల వద్దకు వచ్చిన రైతులు తమ భూములు చెరువు నీటిలో కలిసిపోయాయని, చూపించడానికి తమ వద్ద భూమే లేదని కన్నీటితో సమాధానమిచ్చారు. పాండురంగ చెరువు నిర్మాణంతో నష్టపోయిన తమకు న్యాయం చేయాలని, తమ భూములకు సరైన పరిహారం కల్పించాలని లేదా ప్రత్యామ్నాయ భూమిని చూపించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సర్వే పూర్తయ్యాక నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించి తదుపరి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.



# జర్నలిస్టులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

## మీడియా అకాడమి చైర్మన్ .శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (ఉద్యమ కెరటం) :** జర్నలిస్టులు కూడా ఏఐ పరిజ్ఞానాన్ని తప్పనిసరిగా పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ భవనంలో కృత్రిమ మేధలో టూల్స్ అండ్ టెక్నిక్స్ వర్క్‌షాప్‌ను మీడియా అకాడమీ, డాటా లీడ్స్, గూగుల్ న్యూస్ ఇనిషివేటివ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ప్రముఖ దినపత్రికలు, టీవీ ఛానల్స్‌కు చెందిన తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషలకు సంబంధించిన జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు కూడా వృత్తిలో భాగంగా డిజిటల్ మీడియా, సోషల్ మీడియాలో ఏఐని జర్నలిస్టులు ఉపయోగించుకొని రిపోర్టింగ్‌లో సులభతరమైన పద్ధతులను పాటించి తక్కువ సమయంలోనే ఎక్కువ అంశాలను పాఠకులకు, వీక్షకులకు అందించవచ్చునని అన్నారు. రిసోర్స్ పర్సన్ ఉడుముల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టు కూడా నిత్య విద్యార్థిలాగా ఉండాలన్నారు. అదేవిధంగా తాను కూడా నిత్యం ఏదో ఒకటి నేర్చుకుంటూ నిత్య విద్యార్థిగానే కొనసాగుతున్నానని చెప్పారు. శిక్షణలో భాగంగా ఏఐ టూల్స్ ఉపయోగాలు, ప్రమాదాలు, ఏఐ పద్ధతులు, నియమ నిబంధనలు, ప్రాథమిక అంశాల గురించి వివరించారు. కృత్రిమ మేధ జర్నలిస్టుల వృత్తిలో భాగంగా తప్పనిసరి అయిందన్నారు. చాట్ జీపీటి, పెర్ప్లెక్సిటీ, నోట్ బుక్ ఎలఎం, గూగుల్, జమినై, మిడ్ జర్నీ, సోరా, విఇఓ3, తదితర టూల్స్ ని పరిచయం చేసి జర్నలిస్టులు ఎలా ఉపయోగించాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఉదాహరణల ద్వారా అవగాహన కలిగించారు. ఏఐ డాటా ట్రైయినింగ్‌లో వినియోగంలో లోపం వల్ల, ప్రామ్టింగ్ ఇంజనీరింగ్ సరిగా చేయకపోవడం వల్ల వివక్ష లేదా తప్పుడు సమాచారం వ్యాప్తి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు జూరాలను సందర్శించనున్న బీజేపి బృందం

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (ఉద్యమ కెరటం) :** జూరాల ప్రాజెక్టులోని నీటిమట్టాన్ని పరిశీలించి రైతుల సమస్యలను తెలుసుకునేందుకు తన నేతృత్వంలోని బీజేపీ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం మంగళవారం జూరాల ప్రాజెక్టును సందర్శించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు తెలిపారు. ప్రజల సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే బీఆరఎస్, కాంగ్రెస్‌లు డ్రామాలు ఆడుతున్నాయని విమర్శించారు. వరంగల్‌కు చెందిన ఐటీడీఏ ప్రాజెక్టు విశ్రాంత అధికారితోపాటు పలువురు ప్రముఖులకు పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పంటలను కాపాడేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసేలా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక నాయకుల మధ్య వివాదాలు, సరైన సమన్వయం లేకపోవడం వల్ల దిగువ ప్రాంత రైతులు నష్టపోతున్నారన్నారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంతో మాట్లాడి ఆలమట్టి, నారాయణపూర్ డ్యామ్‌ల నుంచి నీటి విడుదలను తెలంగాణ ప్రభుత్వం నిర్ధారించుకోవాలని కోరారు. ఫామ్‌హౌస్ వివాదాల్లో కేసులు ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. వినాయక నిమజ్జన ఊరేగింపు ఏర్పాట్లకు పోలీసు బలగాలను ఉపయోగించకుండా ఎర్రవల్లి ఫామ్‌హౌస్ చుట్టూ మోహరించి ప్రభుత్వం పోలీసు శాఖను దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యుల అరెస్టును తీవ్రంగా ఖండించారు. సంప్రదాయం ప్రకారం హుస్సేన్‌సాగర్‌లో గణేష్ విగ్రహాల నిమజ్జనానికి అనుమతితోపాటు అన్ని ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. 70 అడుగుల ఎత్తైన విగ్రహాలు సహా భారీ విగ్రహాలను బ్యాక్‌వాటర్‌కు మళ్లించకుండా ట్యాంక్‌బండ్‌లోనే నిమజ్జనం చేయడానికి అనుమతించాల్సిందేనని స్పష్టం చేశారు. 2019 నుంచి బీఆరఎస్ పాలనలో తెలంగాణలో పీఎం ఫసల్ బీమా యోజన అమలు కాకపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే తమ మేనిఫెస్టోలో హామీ ఇచ్చినప్పటికీ పంట బీమాను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని ధ్వజమెత్తారు. రాష్ట్ర రైతాంగ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఫసల్ బీమా యోజనను ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. ఎల్‌నినో పరిస్థితుల వల్ల పంట నష్టపోయిన రైతులకు సరైన సమయంలో బీమా అందక తీవ్ర నిరాశకు గురవుతున్నారని రామచందర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు.

# దానం పిటిషన్‌పై రేపు విచారణ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21 (ఉద్యమ కెరటం):** తనపై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే ఇవ్వాలని కోరుతూ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు అనుమతించింది. పార్టీ ఫిరాయింపుల కేసులో హైకోర్టు తనపై విధించిన అనర్హత వేటును సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి సుప్రీంకోర్టులో సోమవారం మెన్షన్ చేశారు. ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ఈనెల 23న విచారణ చేపట్టనుంది. హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వాలని కోరుతూ దానం నాగేందర్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక





# చరిత్రను విస్మరిస్తే.. వర్తమానం అర్థం కాదు!

**సామ్రాజ్యాల పతనమే ప్రపంచ పటాన్ని మార్చింది**

**మధ్యప్రాచ్య సంక్షోభాలకు శతాబ్దాల చరిత్ర నేపథ్యం**

**యుద్ధాలు కూల్చిన సామ్రాజ్యాలు.. పుట్టుకొచ్చిన కొత్త దేశాలు**

**వలస పాలన నుంచి అగ్రరాజ్యాల ఆధిపత్యం దాకా మారిన ప్రపంచం**

**భారత్‌కు సమతుల్య దౌత్యమే కీలకమన్న చరిత్ర పాఠం**

గతాన్ని అధ్యయనం చేయకుండా వర్తమానాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. తత్వవేత్త జార్జ్ శాంటాయానా 1905లో వెలువరించిన ది లైఫ్ ఆఫ్ రీజన్‌లో గతాన్ని గుర్తుంచుకోని వారు దానిని మళ్లీ అనుభవించే ప్రమాదం ఉందనే భావనను ప్రతిపాదించారు. నేటి ప్రపంచంలో కొనసాగుతున్న అనేక ఘర్షణల వెనుక దశాబ్దాలు, కొన్ని సందర్భాల్లో శతాబ్దాల నాటి రాజకీయ పరిణామాలు ఉన్నాయి. ఇరాన్–అమెరికా–ఇజ్రాయెల్ మధ్య నేటి ఉద్రిక్తతలను కూడా ఒక్క సంఘటనతో వివరించడం సాధ్యం కాదు. ఒట్టోమన్ సామ్రాజ్యం పతనం, బ్రిటిష్ పాలనలో పాలస్తీనా, బాల్ఫోర్ ప్రకటన, ఇజ్రాయెల్ ఆవిర్భావం మధ్యప్రాచ్య రాజకీయ భౌగోళిక స్వరూపాన్ని మార్చిన కీలక ఘట్టాలు. అయితే ప్రస్తుత ఇరాన్–అమెరికా–ఇజ్రాయెల్ సంఘర్షణకు ఒట్టోమన్ సామ్రాజ్యం పతనమే ప్రత్యక్ష కారణమని చెప్పడం చారిత్రకంగా అసంపూర్ణం. అమెరికా–ఇరాన్ విభేదాలకు 1953లో ఇరాన్ ప్రధాని మహమ్మద్ మొసద్దెగ్‌ను తొలగించిన తిరుగుబాటులో అమెరికా, బ్రిటన్ పాత్ర, 1979 ఇస్లామిక్ విప్లవం, అమెరికా రాయబార కార్యాలయ బందీ సంక్షోభం, తదనంతర ఆంక్షలు, అణు వివాదం వంటి పరిణామాలు మరింత ప్రత్యక్ష నేపథ్యంగా ఉన్నాయి. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు పాలస్తీనా ఒట్టోమన్ సామ్రాజ్యంలో భాగంగా ఉండేది. యుద్ధ సమయంలోనే 1917లో బ్రిటన్ బాల్ఫోర్ ప్రకటన ద్వారా పాలస్తీనాలో యూదు ప్రజలకు ఒక 'జాతీయ గృహం' ఏర్పాటుకు మద్దతు ప్రకటించింది. యుద్ధంలో ఒట్టోమన్ ఓటమి అనంతరం పాలస్తీనా బ్రిటిష్ ఆధీనంలోకి వెళ్లగా, 1922లో నానాజాతి సమితి బ్రిటన్‌కు అధికారిక మాండేట్ ఇచ్చింది. ఆ మాండేట్‌లో బాల్ఫోర్ ప్రకటన లక్ష్యం కూడా భాగమైంది. తర్వాతి దశాబ్దాల్లో యూదుల వలసలు పెరగడం, అరబ్ పాలస్తీనియన్ల స్వయం నిర్ణయాధికార డిమాండ్లు, పరస్పర ఘర్షణలు పరిస్థితిని మరింత సంక్లిష్టం చేశాయి. 1947లో ఐక్యరాజ్యసమితి పాలస్తీనాను అరబ్, యూదు రాజ్యాలుగా విభజించే ప్రణాళికను ప్రతిపాదించింది. 1948లో ఇజ్రాయెల్ ఏర్పాటైంది. అందువల్ల 'ఒట్టోమన్ సామ్రాజ్యం పతనమవకపోతే ఇజ్రాయెల్ ఉండేది కాదు' అనేది నిర్ధారించగల చారిత్రక వాస్తవం కాకుండా ఊహాత్మక వ్యాఖ్య మాత్రమే. 1914 నుంచి 1918 వరకు సాగిన మొదటి ప్రపంచ యుద్ధం ప్రపంచ రాజకీయ వ్యవస్థనే మార్చేసింది. రష్యా తొలుత బ్రిటన్, ఫ్రాన్స్‌తో కలిసి పోరాడినా 1917 విప్లవం అనంతరం యుద్ధం నుంచి వైదొలిగింది. యుద్ధం, విప్లవాలు, జాతీయవాద ఉద్యమాల ప్రభావంతో రష్యన్, ఒట్టోమన్, ఆస్ట్రో––హంగేరియన్ సామ్రాజ్యాలు అంతమయ్యాయి. బ్రిటిష్ సామ్రాజ్యం మాత్రం మొదటి ప్రపంచ యుద్ధంతో అంతం కాలేదు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత దాని ఆర్థిక, రాజకీయ శక్తి తీవ్రంగా బలహీనపడింది. భారత స్వాతంత్ర్య ఉద్యమం, వలస దేశాల్లో పెరిగిన జాతీయవాదం, యుద్ధానంతర అంతర్జాతీయ పరిస్థితులు సామ్రాజ్య విచ్ఛిన్నాన్ని వేగవంతం చేశాయి. 1947లో భారత్ స్వాతంత్ర్యం పొందడం ఈ ప్రక్రియలో అత్యంత కీలక ఘట్టం. ఇక్కడ మరో చారిత్రక సవరణ అవసరం. రాష్ట్రపతి భవన్‌ను 1933లో నిర్మించలేదు. అప్పటి వైస్రాయ్ హౌస్ నిర్మాణానికి పదిహేడేళ్లకు పైగా పట్టగా, చివరి రాయి 1929లో వేశారు. ఆ భవనంలోకి వైస్రాయ్ లార్డ్ ఇర్విన్ 1929 ఏప్రిల్ 6న ప్రవేశించినట్లు రాష్ట్రపతి భవన్ అధికారిక చరిత్ర పేర్కొంటోంది. ప్రతి సామ్రాజ్యం పతనానికి ఒకే కారణం లేదు. సైనిక విస్తరణతో పెరిగిన వ్యయం, ఆర్థిక ఒత్తిళ్లు, పరిపాలనా సమస్యలు, జాతీయవాద ఉద్యమాలు, స్వయం పాలన కోసం ప్రజల ఆకాంక్షలు, సాంకేతిక–సామాజిక మార్పులకు తగినట్లు వ్యవస్థలను మార్చుకోలేకపోవడం వంటి అంశాలు వివిధ స్థాయిల్లో ప్రభావం చూపాయి. మొదటి ప్రపంచ యుద్ధం ఈ బలహీనతలను మరింత తీవ్రం చేసి పలు సామ్రాజ్యాల పతనాన్ని వేగవంతం చేసింది. వాటి పతనంతో ప్రపంచ పటమే మారింది. ముఖ్యంగా మధ్యప్రాచ్యంలో ఒట్టోమన్ అనంతర సరిహద్దులు, మాండేట్ వ్యవస్థ, పాలస్తీనా ప్రశ్న నేటికీ ప్రభావం చూపుతున్నాయి. అదే సమయంలో ఉక్రెయిన్, భారత్–పాకిస్తాన్, పూర్వ యుగోస్లేవియా వంటి ప్రతి ఆధునిక వివాదాన్నీ కేవలం పాత సామ్రాజ్యాల పతనంతోనే వివరించడం కూడా సరైంది కాదు. ఒక్కో ప్రాంతానికి వేర్వేరు చారిత్రక, జాతీయ, మత, భౌగోళిక, రాజకీయ కారణాలు ఉన్నాయి. రెండో ప్రపంచ యుద్ధం అనంతరం ప్రత్యక్ష వలస సామ్రాజ్యాల యుగం క్రమంగా ముగిసింది. వాటి స్థానంలో సైనిక స్థావరాలు, ఆర్థిక శక్తి, సాంకేతిక ఆధిపత్యం, అంతర్జాతీయ సంస్థలు, దౌత్య పొత్తుల ద్వారా ప్రభావం చూపే అగ్రరాజ్యాల వ్యవస్థ బలపడింది. అమెరికా, సోవియట్ యూనియన్ ప్రచ్ఛన్న యుద్ధంలో రెండు ప్రధాన శక్తులుగా ఎదిగాయి. 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైన తర్వాత ప్రపంచ శక్తి సమీకరణాలు మరోసారి మారాయి. ఇటీవలి దశాబ్దాల్లో చైనా ఆర్థిక, సాంకేతిక, సైనిక సామర్థ్యాలను భారీగా విస్తరించింది. అయితే చైనా 'ప్రత్యక్ష యుద్ధానికి దూరంగానే ఉంటుంది' అనే సాధారణీకరణకు కూడా మినహాయింపులు, వివాదాస్పద అంశాలు ఉన్నాయి. ప్రపంచ శక్తుల ప్రవర్తనను ఒకే సూత్రంతో వివరించడం కంటే కాలానుగుణంగా వాటి చర్యలను పరిశీలించడం అవసరం. భారత్ ముందు ఉన్న సవాలు కూడా ఇదే. అమెరికా, రష్యా, చైనా, ఐరోపా దేశాలతో సంబంధాలను నిర్వహిస్తూనే పశ్చిమాసియా దేశాలతో ఆర్థిక, ఇంధన, వ్యూహాత్మక సంబంధాలను కొనసాగించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఏ ఒక్క శక్తి కేంద్రంపైనా పూర్తిగా ఆధారపడకుండా జాతీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని దౌత్య నిర్ణయాలు తీసుకోవడం కీలకం. చరిత్ర చెప్పే పాఠం సామ్రాజ్యాలు తప్పకుండా ఒకే విధంగా కూలిపోతాయనేది కాదు. అపరిమిత సైనిక విస్తరణ, ఆర్థిక భారాలు, మారుతున్న ప్రజాకాంక్షలను పట్టించుకోకపోవడం, రాజకీయ వ్యవస్థలను కాలానికి అనుగుణంగా మార్చుకోలేకపోవడం ఎంతటి శక్తినైనా బలహీనపరచగలవన్నదే చరిత్ర పదేపదే గుర్తుచేసే విషయం. అందుకే చరిత్ర అంటే గతించిన కాలపు కథ మాత్రమే కాదు. వర్తమానాన్ని అర్థం చేసుకునే అద్దం.. భవిష్యత్తును నిర్మించుకునే హెచ్చరిక.

# రామ మందిర విరాళాల చోరీ నిందితుల గుర్తింపు

- దర్యాప్తు దాదాపు పూర్తి చేసిన సిట్
- 25లోగా తొలి చార్జిషీట్ దాఖలు
- సీసీటీవీలో 105 చోరీ ఘటనలు
- ఎనిమిది మంది నిందితులు ఇప్పటికే అరెస్టు
- సుప్రీంకోర్టుకు సీల్డ్ కవర్‌లో నివేదిక



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21 (ఉద్యమ కెరటం):** అయోధ్య రామ మందిరంలో భక్తులు సమర్పించిన విరాళాల చోరీ కేసు దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న వారిని గుర్తించామని, దర్యాప్తు దాదాపు పూర్తయిందని ప్రత్యేక దర్యాప్తు బృందం సుప్రీంకోర్టుకు తెలిపింది. సెప్టెంబర్ 25లోగా తొలి చార్జిషీట్‌ను దాఖలు చేయనున్నట్లు వెల్లడించింది. ఇప్పటివరకు ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు వార్తా కథనాలు పేర్కొంటున్నాయి. సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ వ్యవహారంపై విచారణ చేపట్టింది. సిట్ దర్యాప్తు పురోగతికి సంబంధించిన నివేదికను సీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పించింది. ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వివరాలు వెల్లడించారు. తొలి అరెస్టు నుంచి 90 రోజుల గడువు సెప్టెంబర్ 25తో ముగియనున్నందున, అంతకుముందే చార్జిషీట్ దాఖలు చేయాల్సి ఉందని కోర్టుకు తెలిపారు. దర్యాప్తులో ఆలయ ప్రాంగణంలోని సీసీటీవీ దృశ్యాలను సిట్ క్షుణ్ణంగా పరిశీలించింది. విరాళాల చోరీకి సంబంధించిన 105 ఘటనలు సీసీటీవీ కెమెరాల్లో నమోదైనట్లు కోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. సాక్షుల వాంగ్మూలాలు, విరాళాల లెక్కలు, రసీదులు, సంబంధిత పత్రాలు, ఎలక్ట్రానిక్ ఆధారాలను సిట్ సేకరించింది. స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువులను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాకర్లలో భద్రపరిచినట్లు నివేదికలు వెల్లడించాయి. ఈ కేసులో దర్యాప్తును వేగంగా పూర్తి చేసి తార్కిక ముగింపునకు తీసుకెళ్లాలని సుప్రీంకోర్టు గతంలోనే ఆదేశించింది. జూలైలో ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటును పరిగణనలోకి తీసుకున్న సర్వోన్నత న్యాయస్థానం, దర్యాప్తు బృందంలో ఫోరెన్సిక్ ఆడిటర్‌ను కూడా చేర్చాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇదిలా ఉండగా శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తొలి ముఖ్య కార్యనిర్వహణాధికారిగా రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్ర ఇటీవల నియమితులయ్యారు. ఈ పదవికి మొత్తం 5,585 దరఖాస్తులు రాగా, బహుళ దశల ఎంపిక ప్రక్రియ అనంతరం మిశ్రను ఎంపిక చేసినట్లు ట్రస్ట్ వెల్లడించింది. తుది దశకు 16 మందిని ఎంపిక చేసి ఇంటర్వ్యూలు నిర్వహించగా, చివరకు ముగ్గురి పేర్లను పరిశీలించి జితేంద్ర మిశ్రకు బాధ్యతలు అప్పగించారు. సిట్ చార్జిషీట్ దాఖలు చేసిన తర్వాత విరాళాల చోరీ వెనుక ఉన్న పూర్తి వ్యవహారం, నిందితులపై మోపే అభియోగాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# బాలికపై వేధింపులు.. ముగ్గురి అరెస్టు

**పదో తరగతి విద్యార్థులకు వేధింపులు**

**వైరల్ వీడియోతో రంగంలోకి దిగిన పోలీసులు**

**పోక్సో సహా పలు సెక్షన్ల కింద కేసు**

**ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు**

**కఠిన చర్యలు తీసుకోవాలన్న రాహుల్ గాంధీ**





**జాముయ్, సెప్టెంబర్ 21 (ఉద్యమ కెరటం):** బిహార్‌లోని జాముయ్ జిల్లాలో ఇద్దరు పదో తరగతి విద్యార్థులను అడ్డగించి వేధించిన ఘటన తీవ్ర కలకలం రేపింది. బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడడంతోపాటు ఆమె వెంట ఉన్న బాలుడిపైనా దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీసులు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. మిగిలిన నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది. సెప్టెంబర్ 19న రాత్రి 7 గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్లు జాముయ్ ఎస్పీ విశ్వజీత్ దయాల్ తెలిపారు. ఇద్దరు విద్యార్థులు కోచింగ్‌కు వెళ్లిన అనంతరం ఆ ప్రాంతానికి వెళ్లగా కొందరు వారిని అడ్డుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. బాలికతో అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు ఆమెను బలవంతంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నించినట్లు వైరల్ వీడియోల్లో కనిపించింది. అడ్డుకునేందుకు ప్రయత్నించిన బాలుడిపైనా దాడి జరిగినట్లు పోలీసులు తెలిపారు. బాధితుల గోప్యత దృష్ట్యా వారి వివరాలను వెల్లడించలేదు. బాధితుల వాంగ్మూలాలను నమోదు చేసిన పోలీసులు పోక్సో చట్టంలోని సెక్షన్లు 8, 12తోపాటు భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్ల కింద జాముయ్ సదర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. వీడియోలో ఆరు నుంచి ఏడుగురు కనిపిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఇప్పటివరకు ముగ్గురిని అరెస్టు చేయగా, ఘటనపై సమగ్ర దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు.

**'ఇది మన సంస్కృతి కాదు'**

ఈ ఘటనను లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. బాలిక ఎంతగా వేడుకున్నా ఆమెను వేధించే హక్కు ఎవరికీ లేదని పేర్కొన్నారు. వీడియోలో కనిపించిన ప్రతి ఒక్కరినీ గుర్తించి పోక్సో చట్టం కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలు, బాలికల భద్రతపై బిహార్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. జాతీయ మహిళా కమిషన్ కూడా ఘటనను సుమోటోగా స్వీకరించింది. నిందితులందరినీ గుర్తించి చర్యలు తీసుకోవడంతోపాటు బాధితులకు భద్రత, న్యాయ సహాయం, మానసిక సహకారం అందించాలని బిహార్ పోలీసులను కోరింది. ఘటనకు సంబంధించిన వీడియోను మరింత వ్యాప్తి చేయకుండా చర్యలు చేపట్టాలని సూచించింది.

# డ్రగ్స్‌పై దేశవ్యాప్త ఉక్కుపాదం

- ఢిల్లీలో మూడో జాతీయ ఏఎన్‌టీఎఫ్ సదస్సు
- నేడు ప్రారంభించనున్న అమిత్ షా
- 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల చీఫ్‌ల హాజరు
- డ్రగ్ కార్టెల్స్ ఛేదింపుపై ప్రత్యేక దృష్టి
- డార్క్‌నెట్, క్రిప్టో లావాదేవీలపైనా చర్చ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21 (ఉద్యమ కెరటం):** దేశంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగానికి అడ్డుకట్ట వేసే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేస్తోంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్ చీఫ్‌ల మూడో జాతీయ సదస్సును సెప్టెంబర్ 22, 23 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనుంది. రెండు రోజుల సదస్సును కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం ప్రారంభించనున్నారు. మొత్తం 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఏఎన్‌టీఎఫ్ చీఫ్‌లతోపాటు సంబంధిత కేంద్ర ప్రభుత్వ విభాగాలు, ఇతర భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు. 'సమష్టి సంకల్పం–ఉమ్మడి బాధ్యత' ఇతివృత్తంతో జరిగే ఈ సదస్సులో 2026–29 నార్కోటిక్స్ కంట్రోల్ విజన్ డాక్యుమెంట్‌లో నిర్దేశించిన లక్ష్యాల అమలును సమీక్షించనున్నారు. మాదకద్రవ్యాల సరఫరాను తగ్గించడం, వినియోగాన్ని నిరోధించడం, వాటివల్ల కలిగే నష్టాన్ని తగ్గించడం, కేంద్ర–రాష్ట్ర దర్యాప్తు సంస్థల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా చర్చించనున్నారు. దేశీయ, అంతర్జాతీయ డ్రగ్ కార్టెల్స్ నెట్‌వర్క్‌లను గుర్తించి ఛేదించడం, కొత్త రకాల సింథటిక్ డ్రగ్స్‌ను నియంత్రించడం, వాటి తయారీకి ఉపయోగించే రహస్య ప్రయోగశాలలను గుర్తించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. అక్రమ సాగును నిర్మూలించడం, ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం సహా మొత్తం ఎనిమిది సాంకేతిక సమావేశాలను నిర్వహించనున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని సాగుతున్న మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారం కూడా సదస్సులో కీలక అంశం కానుంది. డార్క్‌నెట్ ద్వారా డ్రగ్స్ విక్రయాలు, క్రిప్టోకరెన్సీలతో జరిగే లావాదేవీలను గుర్తించడం, వాటిపై సమర్థంగా దర్యాప్తు చేయడం, డ్రగ్ నెట్‌వర్క్‌ల ఆర్థిక మూలాలను ఛేదించే వ్యూహాలపై చర్చించనున్నారు. సదస్సు ప్రారంభోత్సవం సందర్భంగా లఖ్‌నవూ, డెహ్రాడూన్‌లలో ఏర్పాటు చేయనున్న నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో జోనల్ సముదాయాలకు అమిత్ షా శంకుస్థాపన చేయనున్నారు. మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కోసం రూపొందించిన ప్రచార చిత్రాలను విడుదల చేయడంతోపాటు పునరుద్ధరించిన ఎన్‌సీబీ వెబ్‌సైట్‌ను ప్రారంభించనున్నారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఏఎన్‌టీఎఫ్‌ను సదస్సులో సత్కరించనున్నారు. మాదకద్రవ్యాలపై పోరులో నిఘా, దర్యాప్తు, సమాచార మార్పిడి, పునరావాసం, వివిధ సంస్థల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి 'డ్రగ్ ఫ్రీ ఇండియా' లక్ష్యం దిశగా కార్యాచరణను వేగవంతం చేయడం ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమని కేంద్ర హోంశాఖ తెలిపింది.

# విద్యార్థుల ముందే టీచర్‌ను కాల్చి చంపిన వ్యక్తి..

**అక్కడే కాల్చుకుని ఆత్మహత్య**

**లక్నో:** ఒక వ్యక్తి స్కూల్‌కు వెళ్లాడు. ఒక ఉపాధ్యాయురాలిని కలిసిన అతడు తన వెంట తెచ్చిన తుపాకీతో కాల్పులు జరిపి ఆమెను హత్య చేశాడు. ఆ తర్వాత అతడు తనను తాను గన్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది చూసి ఆ స్కూల్ విద్యార్థులు, టీచర్లు షాక్ అయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీలో ఈ సంఘటన జరిగింది. హిదాయత్ నగర్ నివాసి అయిన 26 ఏళ్ల నిషాత్ ఫాతిమా ఏడాదిగా లఖింపూర్ ఖేరీలోని చిల్డ్రన్స్ అకాడమీ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తున్నది. సోమవారం ఉదయం 11:30 గంటలకు ఆమెకు తెలిసిన 28 ఏళ్ల మహమ్మద్ సౌద్ ఆ స్కూల్‌కు చేరుకున్నాడు. కారిడార్‌లో ఫాతిమాను కలుసుకుని మాట్లాడాడు. ఉన్నట్టుండి బ్యాగ్ నుంచి తుపాకీ తీసి ఆ టీచర్‌పై కాల్పులు జరిపి హత్య చేశాడు. ఆ తర్వాత అక్కడే తనను తాను గన్‌తో కాల్చుకుని అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది చూసి ఆ స్కూల్ విద్యార్థులు, టీచర్లు భయాందోళన చెందారు. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ స్కూల్‌కు చేరుకున్నారు. పిల్లలను స్కూల్ నుంచి వారి ఇళ్లకు పంపివేశారు. ఫోరెన్సిక్ బృందాన్ని రప్పించి ఆధారాలు సేకరించారు. ఆ తర్వాత టీచర్ ఫాతిమా, సౌద్ మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరోవైపు ఫాతిమా, సౌద్ చాలా కాలంగా ఒకరికొకరు తెలుసని, నిత్యం మాట్లాడుకునేవారని పోలీస్ అధికారిణి ఖ్యాతి గార్గ్ తెలిపారు. అయితే సౌద్ ఎందుకు ఆమెను కాల్చి చంపి ఆత్మహత్యకు పాల్పడ్డాడో అన్నది తెలియలేదని చెప్పారు. ఇరు కుటుంబాలతో పాటు, స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, ప్రత్యక్ష సాక్షులు, ఇతరులను విచారిస్తున్నట్లు పోలీస్ అధికారిణి వివరించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# రాధాకృష్ణ చారికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ పురస్కారం

**విద్యా, సాహిత్య, పత్రికా రంగాల్లో విశేష సేవలకు అరుదైన గుర్తింపు**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని శాంతినికేతన్ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులు, ప్రముఖ కవి, రచయిత, జర్నలిస్ట్ చిలుకూరి రాధాకృష్ణ చారికి ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి పురస్కారం అందుకోనున్నారు. ఆయనకు 'డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ పురస్కారం' కి ఎంపికయ్యారు. తెలుగు వెలుగు సాహితీ సంస్థ, శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం 2026 సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన వరంగల్ పట్టణంలో ఘనంగా నిర్వహించే పురస్కారాల వేడుకలో ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేయనున్నట్లు రాధాకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ బాలీవుడ్, టాలీవుడ్ నటి నూపూర్ ముఖర్జీ, సినీ హాస్య నటులు ఆర్.ఎస్. నందల చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. విద్యా, సాహిత్య, పత్రికా రంగాల్లో చిలుకూరి రాధాకృష్ణ చారి అందిస్తున్న బహుముఖ సేవలకు ఈ జాతీయ పురస్కారం లభించడం పట్ల ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దపల్లి కిషన్ రావు, జిల్లా అధ్యక్షులు పరదేశీ దేవాభూషణం తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. రాధాకృష్ణ చారికి వారు ప్రత్యేక శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

# గణనాథునికి ప్రత్యేక పూజలు



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తా సమీపంలోని ఎస్బీఐ బ్యాంక్ వద్ద ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన త్రివర్ణ జనశక్తి మండలి గణనాథునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖ వ్యాపారవేత్త కాసనగొట్టు వెంకటరమణ–స్వప్న దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ దండే విఠల్ దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం గణనాథుని దర్శనానికి వచ్చిన భక్తులు, స్థానికుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో త్రివర్ణ జనశక్తి మండలి సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలను సండ్ర పరామర్శ



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వేంసూర్ మండల పరిధిలోని లచ్చన్న గూడెంకు చెందిన పర్సా ఆనందరావు ఇటీవల పిడుగుపాటుకు గురై అకాల మరణం చెందాడు. విషయం తెలుసుకున్న సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆనందరావు కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న ఆనందరావు పిడుగుపాటుతో మృతిచెందడం అత్యంత బాధాకరమన్నారు. ముగ్గురు ఆడబిడ్డల భవిష్యత్తుకు అండగా నిలవాల్సిన సమయంలో కుటుంబ పెద్దను కోల్పోవడం కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, అన్ని విధాలా ఆదుకునేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన పర్సా కృష్ణ, ఈడా వెంకటేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోతురాజు చక్రధరావు, మాజీ ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, దొడ్డ వెంకట కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ పోతురాజు పావల్ రాజ్, నాయకులు గొర్ల రాంమోహన్ రెడ్డి, గంండ్ర సోమిరెడ్డి, ఆర్చేపల్లి కరుణప్రసాద్, గుత్తా శ్రీనివాసరావు, పగుట్ల నరసింహారావు, వీరబాబు, మేడా విజయబాబు, పగుట్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- **జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై వచ్చే దరఖాస్తులను తత్వమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్ తో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని రెబ్బెన మండలం గోలేటి కి చెందిన లావుడ్య మమత తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జైనూర్ మండలం జంగాం గ్రామానికి చెందిన కొడప అనుతారావు తనకు దివ్యంగ పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. సిర్పూర్ టి మండలం పారిగాం గ్రామానికి చెందిన దుర్కే విశ్వనాథ్ తనకు గతంలో పింఛను వచ్చి ఆగిపోయిందని తిరిగి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జిల్లా కేంద్రానికి చెందిన కాంబ్లే కీర్తికుమార్ తనకు ప్రభుత్వ వైద్య కళాశాలలో పొరుగు సేవలు కింద ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. సిర్పూర్ పి మండల కేంద్రానికి చెందిన గద్దల రమేష్ తనకు విశ్వకర్మ పథకం కింద రుణ సదుపాయం కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. చింతల మానేపల్లి మండలం బాబాసాగర్ గ్రామానికి చెందిన పిప్పిరే బాబాజీ తన వాటా భూమిని ఇతరులు ఆక్రమించినందున తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రత్నం పరిష్కరించే దిశగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు అర్జీదారులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో నిందితుడికి 5 ఏళ్ల జైలు

**రూ.10 వేల జరిమానా**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** వాంకిడి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శారదా దేవి తీర్పునిచ్చినట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం వాంకిడి మండలానికి చెందిన వడ్డురే హనుమంతు (66) అనే వ్యక్తి 2022 సంవత్సరం మే 7న ఆడుకుంటున్న ఒక చిన్నారికి రూ.50 ఎర చూపి మాయమాటలతో తన ఇంటికి తీసుకెళ్లాడు. బాలిక అరుపులు విన్న చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకుని నిందితుడిని పట్టుకున్నారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి వాంకిడి ఎస్సై లావణ్య కేసు నమోదు చేయగా, నాటి డీఎస్పీ శ్రీనివాస్ దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.శ్రీనివాస్ 11 మంది సాక్షులను ప్రవేశపెట్టి వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పోక్సో సెక్షన్-10 కింద ఈ శిక్ష ఖరారు చేశారు.ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా పనిచేసిన పిపి ఎం. శ్రీనివాస్, డీఎస్పీ బి. అశోక్, సీఐ ఎస్ వేణుగోపాల్, ఎస్సై డి. మహేందర్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ జె. బాల్ సింగ్, భరోసా అడ్వకేట్ శైలజ, సిబ్బందిని ఎస్పీ నితికా పంత్ అభినందించారు. నేరాలకు పాల్పడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

# రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

- **యాతాలకుంట వద్ద టన్నెల్ పనుల తనిఖీ చేసిన మంత్రి తుమ్మల**

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ప్రాజెక్టుల ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరేలా పనులను ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండల పరిధిలోని యాతాలకుంట వద్ద కొనసాగుతున్న టన్నెల్ నిర్మాణ పనులను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. టన్నెల్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి పనుల ప్రస్తుత స్థితిగతులు, ఎదురవుతున్న సమస్యలు, పనుల పురోగతిపై ఇరిగేషన్ అధికారుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ములకలపల్లి మండలం కమలాపురం వద్ద సీతారామ ప్రాజెక్టు పంప్హౌస్ పరిస్థితులపై అధికారులతో సమీక్ష సమావేశానికి వెళ్తున్న సందర్భంగా యాతాలకుంట వద్ద మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా టన్నెల్ నిర్మాణానికి సంబంధించిన వివిధ అంశాలపై అధికారులతో చర్చించారు. నిర్దేశిత ప్రణాళిక ప్రకారం టన్నెల్ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగునీటి సౌకర్యం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని



తెలిపారు. మంత్రి వెంట అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర మ్యూజియంను పునరుద్ధరించాలి

**ఎమ్మెల్యే పాల్వాయి హరీష్బాబు**

**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** తెలంగాణ రాష్ట్ర మ్యూజియంను పునరుద్ధరించాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్బాబు అన్నారు. హైదరాబాద్లోని పబ్లిక్ గార్డెన్స్లో ఉన్న తెలంగాణ రాష్ట్ర మ్యూజియాన్ని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా మ్యూజియంలో భద్రపర్చిన పురాతన విగ్రహాలు, అరుదైన కళాఖండాలు, బుద్ధుని ఆవశేషాలు, ఈజిప్షియన్ మమ్మీ తదితర చారిత్రక వస్తువులను పరిశీలించారు. వాటి చారిత్రక ప్రాధాన్యత, వివరాలను సంబంధిత సిబ్బంది ద్వారా అడిగి తెలుసుకున్నారు.



అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర మ్యూజియం రాష్ట్ర చారిత్రక, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన మ్యూజియానికి తగిన స్థాయిలో నిర్వహణ లేకపోవడం బాధాకరమన్నారు. మ్యూజియంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మ్యూజియంలో మౌళిక వసతులను మెరుగుపర్చడంతో పాటు పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. చారిత్రక సంపదను పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందించేందుకు తెలంగాణ రాష్ట్ర మ్యూజియం అభివృద్ధికి ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

# కోర్టు ఆదేశాలు బేఖాతరు

- **కళ్లకు గంతలు కట్టుకుని కోర్టు నుంచి కలెక్టరేట్ వరకు నిరసన**

**ఉద్యమ కెరటం, కరీంనగర్:** సెక్షన్ 22-ఎ(1)(డి) కింద పట్టా భూములను సీలింగ్ యాక్ట్లో చేర్చడంతో వేలాది కుటుంబాలకు అన్యాయం జరుగుతోందని సామాజిక కార్యకర్తలు కోట శ్యామ్కుమార్, బెల్లపు కరుణాకర్ ఆరోపించారు. ఈ సమస్యపై కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని నిరసన వ్యక్తం చేశారు. సోమవారం కరీంనగర్ కోర్టు చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం కోర్టు నుంచి కలెక్టరేట్ వరకు కళ్లకు గంతలు కట్టుకుని నడుచుకుంటూ వెళ్లి కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ అంశాన్ని 60 రోజుల్లో పరిష్కరించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చినా 180 రోజులు గడిచినప్పటికీ అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టా భూములను సీలింగ్ యాక్ట్లో చేర్చడం ద్వారా అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. అధికారులు కళ్లుమూసుకుని వ్యవహరిస్తున్నారనే నిరసనకు గుర్తుగా కళ్లకు గంతలు కట్టుకుని కలెక్టరేట్కు వెళ్లినట్లు తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు.





# రోడ్డు ప్రమాదంలో డాక్టర్ జగదీష్ మృతి

- ఖమ్మం జిల్లా వైద్య రంగానికి తీరని లోటు
- హైవే భద్రతపై ప్రశ్నలు

**ఉద్యమ కెరటం, ఖమ్మం:** ఖమ్మం జిల్లా వైద్య రంగానికి తీరని లోటు ఏర్పడింది. ప్రజల ప్రాణాలను కాపాడుతూ న్యూరో సర్జన్గా పేరు సంపాదించుకున్న డాక్టర్ కాసుకుర్తి జగదీష్ ఆదివారం ఉదయం విజయవాడ– హైదరాబాద్ జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అగ్నికి ఆహుతై మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఎంతో మంది ప్రాణాలను కాపాడిన వైద్యుడు చిన్న వయసులోనే దురదృష్టవశాత్తు మృతిచెందడం పట్ల కుటుంబ సభ్యులు, వైద్యులు, ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ జగదీష్ వైద్య రంగంలో తన సేవలతో ఎంతో మంది ప్రాణాలను నిలబెట్టారని, అలాంటి వైద్యుడు రోడ్డు ప్రమాదంలో మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


### హైవే భద్రతపై తీవ్ర ప్రశ్నలు..

ప్రమాదం నేపథ్యంలో జాతీయ రహదారులపై అత్యవసర స్పందన వ్యవస్థపై వాహనదారులు, ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. టోల్ ట్యాక్స్ వసూలులో చూపుతున్న చొరవను ప్రజల ప్రాణాలను కాపాడే అత్యవసర సేవల్లోనూ చూపించాలని కోరుతున్నారు. కారు డివైడర్ను ఢీకొని మంటల్లో చిక్కుకున్న సమయంలో తక్షణమే స్పందించి బాధితుడిని రక్షించే ఫైర్ సేఫ్టీ, ఎమర్జెన్సీ రెస్పాన్స్ వ్యవస్థలు హైవేపై సమర్థంగా అందుబాటులో ఉన్నాయా..? అనే ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి. వాహనం పూర్తిగా దగ్ధమైన తర్వాత అధికారులు చేరుకోవడంతో ప్రయోజనం ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### వరుస ప్రమాదాలపై చర్యలు ఎప్పుడు..?

నేషనల్ హైవే 365బిపై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ప్రమాదాలకు కారణమవుతున్న అంశాలను అధికారులు సమగ్రంగా పరిశీలించి, అవసరమైన





భద్రత చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. ప్రమాదాలు జరిగిన ప్రతిసారి ఘటనపై స్పందించడం మాత్రమే కాకుండా, ప్రమాదాలకు దారితీస్తున్న లోపాలను గుర్తించి శాశ్వత పరిష్కారాలు చూపాలని డిమాండ్ చేస్తున్నారు. హైవేపై ఫైర్ సేఫ్టీ, అంబులెన్స్, అత్యవసర స్పందన బృందాల అందుబాటు, ప్రమాద ప్రాంతాల్లో భద్రత ప్రమాణాలపై ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించాలని కోరుతున్నారు. వరుస ప్రమాదాల నేపథ్యంలో సంబంధిత అధికారులు ఇకనైనా నిర్లక్ష్యం వీడి హైవే భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రమాదాల నివారణకు కఠినమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. హైవేపై భద్రత లోపాలు, అత్యవసర స్పందన వ్యవస్థలపై ఇప్పటికే పలు పత్రికా కథనాలు ప్రచురితమైనప్పటికీ, సంబంధిత అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారాలు చూపడం లేదని వాహనదారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# బాలికల సంక్షేమమే మోదీ లక్ష్యం

**ఉద్యమ కెరటం, తాండూర్:** దేశంలోని బాలికల సంక్షేమం కోసం పనిచేస్తున్న ఏకైక ప్రభుత్వం కేంద్రంలోని మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వమని ఆ పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు చిలుముల శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. సోమవారం ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. నేటి బాలలే రేపటి దేశ పౌరులని విద్యార్థులంతా క్రమశిక్షణతో చదివి ఉన్నతమైన స్థాయికి వెళ్లాలని



ఆకాంక్షించారు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం బాలికల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతుందని తెలిపారు. 25 ఏళ్ల ప్రజా జీవితంలో ఈ దేశానికి మోదీ విశేష సేవలందించారని గుర్తు చేశారు. మోదీ ప్రభుత్వం ఈ దేశంలోని మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కవిత, బీజేపీ మండల అధ్యక్షులు దూడపాక భరత్ కుమార్, జిల్లా కార్యదర్శి రామగౌని మహిధర్ గౌడ్, సీనియర్ నాయకులు, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు పులగం తిరుపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్ధం మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, మండల కార్యదర్శి గాదె రాజేశం, మండల నాయకులు ఆవుల చందు, కామెర మహేష్, ఉపాధ్యాయురాలు సుమన చైతన్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జనానికి నీటి విడుదలపై బీజేపీ డ్రామా

- సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్రెడ్డి ఫైర్

**ఉద్యమ కెరటం, కరీంనగర్:** గణేశ్ నిమజ్జనానికి చింతకుంట కెనాల్లో నీటి విడుదల విషయంలో బీజేపీ నాయకులు చేపట్టిన ధర్నా డ్రామాగా ఉందని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్రెడ్డి విమర్శించారు. సోమవారం చింతకుంట కెనాల్ వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లు, నీటి విడుదల అంశాలపై మంత్రులు, అధికారులు వారం రోజులుగా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ముందస్తు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఇప్పటికే కెనాల్లో సిల్ట్ తొలగింపు, డస్ట్ పోయడం తదితర పనులు చేపట్టారని, అవసరమైన మిషనరీ కూడా అక్కడికి చేరుకుందని చెప్పారు. అధికారులు ముందుగానే ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ బీజేపీ నాయకులు ధర్నా చేసిన ఐదు నిమిషాల్లోనే ప్రభుత్వం నీటి విడుదలపై నిర్ణయం తీసుకుందని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ధర్నాను ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని ప్రకటించి, 11 గంటలకు నీరు విడుదల కానున్న విషయం తెలుసుకుని 10.30 గంటలకే ధర్నా చేయడం వారి ప్రచార తీరుకు నిదర్శనమని విమర్శించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ఇలాంటి రాజకీయ డ్రామాలు ఇక పని చేయవన్నారు. కరీంనగర్ అభివృద్ధితో పాటు అన్ని పండుగలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. భక్తులు,



ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిమజ్జన ఏర్పాట్లు చేస్తున్నామని, అన్నివర్గాల మనోభావాలను గౌరవిస్తూ ఉత్సవాలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

# ఆకట్టుకున్న వినాయక జన్మ రహస్యం నృత్య రూపకం

**ఉద్యమ కెరటం, తాండూర్:** వినాయక నవరాత్రి వేడుకల్లో భాగంగా శ్రీ గణేశ్ మండలి తాండూర్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నటరాజ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన "వినాయక జన్మ రహస్యం" నృత్య రూపకం విశేషంగా ఆకట్టుకుంది. నృత్య గురువు అల్లాడి అర్చన జయప్రకాశ్ శిక్షణలో విద్యార్థులు భక్తి, నృత్యం, అభినయంతో వినాయకుడి జన్మ వృత్తాంతాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. కూచిపూడి నృత్య శైలిలో సాగిన ఈ నృత్య రూపకం ప్రేక్షకులను అలరించింది. వినాయకుడి జననం, పార్వతీదేవి సృష్టి, శివపార్వతుల



కథాంశాలను నృత్యం, సంగీతంతో విద్యార్థులు చక్కగా ఆవిష్కరించారు. ప్రదర్శన అనంతరం విద్యార్థులను శ్రీ గణేష్ మండలి నిర్వాహకులు, సభ్యులు, భక్తులు అభినందించి శాలువాలతో, మెమెంటులతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నటరాజ డ్యాన్స్ అకాడమీ నృత్య గురువు అల్లాడి అర్చన జయప్రకాశ్ మాట్లాడుతూ భారతీయ శాస్త్రీయ నృత్యం ద్వారా మన పురాణాలు, సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో విద్యార్థులకు ఇలాంటి నృత్య రూపకాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

# ఉద్యమ దార్శనికుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

## తహశీల్దార్ రాజమల్లు

**ఉద్యమ కెరటం, కరీంనగర్:** తెలంగాణ ఉద్యమానికి కొండంత అండగా నిలిచిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ మూడు తరాల ఉద్యమ దార్శనికుడని రామడుగు తహశీల్దార్ దాసరి రాజమల్లు అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవానికి ఆయన ప్రతీక మాత్రమే కాకుండా పతాకగా నిలిచారని కొనియాడారు. గోపాల్రావుపేట పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పద్మశాలి భవన్లో సోమవారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపూజీ తన జీవితాన్ని ప్రజల కోసం, సమాజం కోసం అంకితం చేశారని అన్నారు. తెలంగాణ కోసం ఎన్నో త్యాగాలు చేసిన ఆయన పదవుల కంటే తెలంగాణ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొన్నారు. వివిధ కుల సంఘాలు, సహకార సంఘాలకు బాపూజీ మార్గదర్శకత్వం వహించారని, సంఘాల రిజిస్ట్రేషన్లు, రిజర్వేషన్లు, కులవృత్తి సహకార సంఘాలకు సబ్సిడీలు, రాయితీలు, చేనేత అభివృద్ధి, హక్కుల సాధన కోసం కృషి చేశారని తెలిపారు. బహుజనులు అన్ని రంగాల్లో సాధికారత సాధించాలంటే విద్యే ప్రధాన మార్గమని భావించి విద్యార్థులకు హాస్టల్ సౌకర్యాల కల్పనకు కృషి చేశారని వివరించారు. పద్మశాలి యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక కమలాకర్ మాట్లాడుతూ ప్రతి చేనేత కుటుంబానికి చేనేత బీమా పథకాన్ని వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. చేనేత బీమా పథకానికి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడవల్లి వనజా నరేందర్రెడ్డి, ఉప సర్పంచ్ బుర్ర నరేష్గౌడ్, పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు కొలిపాక మల్లయ్య, వర్తక సంఘం అధ్యక్షుడు కొలిపాక నాగరాజు, పద్మశాలి సంఘం నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# వెంకటాపురంలో వరుస కోళ్ల దొంగతనాలు

## సీసీ కెమెరాల వైరును తొలగించి ఐదు పుంజులు అపహరణ
## పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వేంసూరు మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో వరుసగా కోళ్ల దొంగతనాలు జరుగుతుండటంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు సీసీ కెమెరాల వైరును తొలగించి ఐదు పుంజులను దొంగిలించినట్లు బాధితులు తెలిపారు. గతంలోనూ ఇదే ఇంట్లో మూడు నెలల క్రితం ఒక పుంజు దొంగతనానికి గురైనట్లు బాధితులు పేర్కొన్నారు. గత మూడు నెలల కాలంలో గ్రామంలోని మూడు ఇళ్లలో వరుసగా పుంజుల దొంగతనాలు జరిగినట్లు స్థానికులు తెలిపారు. రాత్రి వేళల్లో, ముఖ్యంగా తెల్లవారుజామున కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో దొంగతనాలు జరుగుతుండటంతో గ్రామస్థుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. గ్రామంలో జరుగుతున్న వరుస కోళ్ల దొంగతనాలపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు కూడా చేసినట్లు బాధితులు తెలిపారు. దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి నిందితులను గుర్తించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# పాముకాటుతో ఒకరి మృతి

## పరామర్శించిన డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వేంసూర్ మండల పరిధిలోని లచ్చన్నగూడెం గ్రామానికి చెందిన పుచ్చకాయల వీరస్వామి పాముకాటుతో మృతి చెందాడు. సోమవారం పార్థివదేహాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వేంసూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసర చంద్రశేఖర్ రెడ్డి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పుచ్చకాయల సోమిరెడ్డి, వేంసూరు మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సబ్ కలెక్టర్కు ఎమ్మెల్సీ దండే విఠల్ శుభాకాంక్షలు



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్నగర్ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సబ్ కలెక్టర్ హర్ష్ చౌదరిని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# కుమారిలో పింఛన్ లబ్ధిదారుల సామాజిక తనిఖీ



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిధిలోని కుమారి గ్రామంలో పింఛన్ లబ్ధిదారుల అర్హతల పరిశీలనకు సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్పీ రాజు, స్పెషల్ ఆఫీసర్ సతీష్ పాల్గొని గ్రామంలో వృద్ధులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు తదితర పింఛన్లు పొందుతున్న లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించారు. పింఛన్లు పొందుతున్న వారిలో అర్హులు, అనర్హుల వివరాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలకే అందాలనే ఉద్దేశంతో ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లక్ష్మణ్, ఉప సర్పంచ్ ఆడేపు రవి, పంచాయతీ కార్యదర్శి దత్త హరి, కారోబార్ ఎన్.రాజు, గ్రామ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# వైభవంగా వినాయక నవరాత్రి వేడుకలు..

**శ్రీరామ కాలనీలో ప్రత్యేక పూజలు.. భక్తులకు అన్నదానం**



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** మండలంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మండలంలోని పలు గ్రామాలు, కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలు సోమవారం భక్తులతో సందడిగా మారాయి. నిర్వాహకులు ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహిస్తూ ఆకట్టుకుంటున్నారు. ఇందులో భాగంగా గంభీరావుపేట మండల కేంద్రంలోని శ్రీరామ కాలనీలో స్థానికులు ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులు, గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గణనాథుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రైతులు ఆనందంగా ఉండాలని వినాయకుడిని ప్రార్థించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ కాలనీ వాసులు, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పీచరలో ప్రధాన రహదారులకు మొరం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని పీచర గ్రామంలో ప్రభుత్వ గిరిజన పాఠశాల పరిసరాలతో పాటు గ్రామంలోని ప్రధాన వీధుల్లో గ్రావెల్ (మొరం) వేయించినట్లు సర్పంచ్ బైరి లింగవ్వ రాజేందర్ తెలిపారు. గ్రామ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారులను మెరుగుపర్చే చర్యల్లో భాగంగా ఈ పనులు చేపట్టామని అన్నారు. గ్రామాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అవసరమైన మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

# గ్రామంలో మౌళిక వసతుల కల్పనకు ప్రాధాన్యత





**ఉద్యమ కెరటం, జైనూర్:** గ్రామంలో మౌళిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని జంగాం సర్పంచ్ పెందూర్ అనుసయా అర్జున్, ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ అన్నారు. గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. గ్రామంలోని విద్యుత్ స్తంభాలు, లైన్లు, వీధిదీపాల పరిస్థితిని పరిశీలించి సోమవారం మరమ్మతు పనులు నిర్వహించారు. రాత్రి వేళ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వీధుల్లో తగిన వెలుతురు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రధాన రహదారులు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో వీధిదీపాలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల రాత్రి వేళ విద్యుత్ సమస్యలు, వీధుల్లో వెలుతురు లేకపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పనులు చేపట్టినట్లు తెలిపారు.

# నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలి





- **ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ**

**ఉద్యమ కెరటం, కరీంనగర్:** మానకొండూర్ చెరువు వద్ద వినాయక నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లను తక్షణమే పూర్తి చేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. సోమవారం మానకొండూర్ చెరువు వద్ద వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ కరీంనగర్ తోపాటు మానకొండూర్ చుట్టుపక్కల గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు మానకొండూర్ చెరువుకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో నిమజ్జన కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బండి రాజేశ్వరి, ఎంపీడీఓ వీవీ వరలక్ష్మి, తహశీల్దార్ విజయ్ కుమార్, గ్రామ సర్పంచ్ తాళ్లపల్లి వర్షిణీ, ఎంపీఓ సంతోష్ రావు, సీఐ శ్రీలత, మాజీ జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపల్లి సంపత్ గౌడ్, ప్యాక్స్ చైర్మన్లు ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మారెడ్డి, పార్టీ నాయకులు మర్రి ఓదెలు యాదవ్, రామిడి తిరుమల్ రెడ్డి, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, రేవెల్లి రాజలింగం, కిషన్ రావు, బుర్ర శ్రీధర్ గౌడ్, రామడుగు హరీష్, మీస సత్యనారాయణ, బోళ్ల మురళీధర్, గొల్లెన కొమురయ్య, బండి మల్లేషం, సాయిరి దేవయ్య, తాళ్లపల్లి నరేష్, కొండ్ర నరేష్, ఇర్ఫాన్, మాతంగి సహదేవ్, బొంగోని సునీల్, ఎన్.బాపురావు, గుడాల మహేందర్, జేడీ శ్యామ్, ఏగోళం శ్రీనివాస్ గౌడ్, డి.శ్రీనివాస్, బి.రమేశ్, నల్ల సూర్య,ముక్కెర సతీష్ కుమార్, అంజయ్య, తమిశెట్టి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆయుర్వేద దినోత్సవ వేడుకలు

**ఉద్యమ కెరటం, తాండూర్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీ ఆధ్వర్యంలో 11వ ఆయుర్వేద దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది "ఆరోగ్యకరమైన రేపటి కోసం ఆయుర్వేదం" అనే అంశంపై కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు, విద్యార్థులకు ఆయుర్వేద వైద్యం, జీవనశైలిపై అవగాహన కల్పించారు. స్థానిక అంగన్వాడీ కేంద్రం సమన్వయంతో ఆయుర్వేద ఆధారిత పోషకాహార పెంపొందింపు, ఆరోగ్యకరమైన జీవనశైలిపై తల్లులకు, పిల్లలకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. సమగ్ర ఆరోగ్య, వెల్నెస్ క్యాంప్ ఏర్పాటు చేసి, ప్రజలకు ప్రకృతి పరీక్ష చేశారు. అనంతరం రోగులకు ఉచితంగా ఆయుర్వేద మందులను పంపిణీ చేశారు. తాండూర్ అంగన్వాడీ కేంద్రంతో పాటు తంగళ్లపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం కోసం యోగా, ధ్యానం, వెల్నెస్ కార్యక్రమాలను చేపట్టారు. కేజీబీవీ, కళాశాల విద్యార్థులకు ఆయుర్వేదంపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి, గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ వైద్య శిబిరం, అవగాహన కార్యక్రమాల ద్వారా పరిసర ప్రాంతాలకు చెందిన మొత్తం 145 మంది ప్రజలు, విద్యార్థులు లబ్ధి పొందారని అధికారులు తెలిపారు. ఈ వేడుకల్లో కిష్టంపేట గ్రామ సర్పంచ్ సార్ల తిరుపతి, స్థానిక ఉపాధ్యాయులు, ఆయుష్



మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌజన్య, ఫార్మసిస్ట్ వెంకటేశ్వరరావు, యోగా ఇన్స్ట్రక్టర్ చంద్రశేఖర్, ఆయుర్వేద డిస్పెన్సరీ సిబ్బంది, ఎంఎన్ఓ విశ్వప్రసాద్, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పెండింగ్లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను విన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి సత్వరమే పరిష్కారం చూపాలని సూచించారు. శాఖల వారీగా పెండింగ్లో ఉన్న దరఖాస్తులను సమీక్షించి, పరస్పర సమన్వయంతో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు సత్వర న్యాయం అందేలా



అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని పేర్కొన్నారు. ప్రజావాణిలో ప్రధానంగా విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, ఆసరా పింఛన్లు, భూ సమస్యలు తదితర అంశాలపై ప్రజలు వినతిపత్రాలు సమర్పించారు. వికలాంగులకు కోటా కంటే అధికంగా డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించడంతో పాటు ప్లంబింగ్, నీటి సరఫరా, వీధిదీపాల సమస్యలను సత్వరం పరిష్కరించినందుకు హ్యాండిక్యాప్ హెల్పింగ్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు కలెక్టర్ రాజర్షిషాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ కలెక్టర్ను శాలువాతో సత్కరించి, ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఆర్ఎస్.చిత్రు, రాజేశ్వర్, డీఆర్ఓ స్రవంతి, ఏఓ వర్ణ, డీఆర్డీఏ అధికారి రవీందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రహస్యంగా సామాజిక తనిఖీలు..?

- **గ్రామసభలకు ప్రజలు హాజరుకాకపోవడంపై అనుమానాలు**



**ఉద్యమ కెరటం, సిర్పూర్(యు):** ఉపాధిహామీ పథకం ద్వారా ఏడాది కాలంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్న తీరు చర్చనీయాంశంగా మారింది. ప్రజల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించాల్సిన సామాజిక తనిఖీలు, గ్రామసభల వివరాలు ప్రజలకు తెలియకుండా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత మూడు, నాలుగు రోజులుగా మండలంలోని పలు గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం ఉపాధిహామీ పనులను పరిశీలించినట్లు సమాచారం. సోమవారం ఆయా గ్రామ పంచాయతీ కేంద్రాల్లో గ్రామసభలు నిర్వహించినట్లు తెలుస్తోంది. అయితే గ్రామసభలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కాకపోవడం, ముందస్తుగా సమాచారం ఇవ్వలేదనే ఆరోపణలతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఓ గ్రామసభలో ఉపాధిహామీ సిబ్బంది, సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉండగా, గ్రామస్తులు నలుగురు మాత్రమే హాజరైనట్లు సమాచారం. ప్రజల సమక్షంలో జరగాల్సిన గ్రామసభకు గ్రామస్తులు లేకపోవడంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సామాజిక తనిఖీ బృందం ఎప్పుడు మండలానికి వచ్చింది, ఏ గ్రామాల్లో తనిఖీలు నిర్వహించింది, ఎప్పటివరకు తనిఖీలు కొనసాగుతాయనే విషయాలను ప్రజలకు వెల్లడించకపోవడం సరికాదని అంటున్నారు. గ్రామసభల్లో ఎలాంటి అంశాలు వెలుగులోకి వచ్చాయో ప్రజలకు తెలియజేయకుండా సమావేశాలు నిర్వహించడం పట్ల అనుమానాలు తలెత్తుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. నిధుల వినియోగం, పనుల అమలు తదితర అంశాలపై పూర్తిస్థాయిలో పారదర్శకత ఉండాలని కోరుతున్నారు. అయితే నిధుల గోల్మాల్ జరిగినట్లు ఇప్పటివరకు అధికారికంగా నిర్ధారణ కాలేదు. ఈ విషయంపై ఏపీఓ, ఎంపీడీఓలను వివరణ కోరగా.. ఇకపై సామాజిక తనిఖీలకు సంబంధించిన అన్ని వివరాలను ప్రజలకు తెలియజేస్తామని తెలిపినట్లు సమాచారం. సామాజిక తనిఖీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, గ్రామ సభలకు సంబంధించి ప్రజలకు ముందస్తు సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు ఈ వ్యవహారంపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీలతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. నెన్నెల మండలం నందులపల్లి గ్రామానికి చెందిన ఇందూరి నాగయ్య తన కుమారుడు తన భూమిలోకి రాకుండా అడ్డుకుంటూ భయపెడుతున్నాడని, న్యాయం చేయాలని కోరారు. క్యాతన్పల్లి మున్సిపాలిటీ 5వ వార్డుకు చెందిన గుర్రం అంకమ్మ తాను రేకులతో తాత్కాలిక ఇల్లు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నానని, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు సమర్పించారు. లక్షెట్టిపేట మండలం లక్ష్మీపూర్కు చెందిన కల్లు సునీతకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా బేస్మెంట్ స్థాయి వరకు నిర్మాణం పూర్తయిందని, తనకు రావాల్సిన బిల్లును ఇప్పించాలని కోరారు. నెన్నెల మండలం గన్పూర్కు చెందిన కొట్టే అశోక్ తన తండ్రి పేరిట ఉన్న భూమి నిషేధిత జాబితాలో ఉందని, రికార్డులను పరిశీలించి సవరించాలని విజ్ఞప్తి చేశారు. జన్నారం మండలం కవ్వాల్ గ్రామ సర్పంచ్ తమ గ్రామానికి చెందిన వారు కాని కొంత మంది వ్యక్తులు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, విచారణ జరిపి ఓటరు జాబితా ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని కోరారు. దండేపల్లి మండల కేంద్రానికి చెందిన జి.శైలజ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఫిజిక్స్ గెస్ట్ టీచర్గా విధులు నిర్వహించానని, తనకు రావాల్సిన వేతనం ఇప్పించాలని దరఖాస్తు సమర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత అధికారులు సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అంతకుముందు మందమర్రి మున్సిపల్ పరిధిలోని శ్రీపతినగర్లో అక్షర యూత్ గణేష్ మండలి ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడిని కలెక్టర్ కుమార్ దీపక్ మున్సిపల్ కమిషనర్ రాజలింగుతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి పూజించడం అభినందనీయమని కొనియాడారు. వినాయక విగ్రహాల తయారీలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగుల వినియోగంతో వాయు, జల, నేల కాలుష్యం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, గణేష్ మండలి నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



# సీహెచ్సీలో సదరం క్యాంప్ ఏర్పాటు చేయాలి

- **కలెక్టర్కు వినతిపత్రం అందజేసిన ఆదివాసీ మిత్ర వెల్ఫేర్ సొసైటీ**

**ఉద్యమ కెరటం, జైనూర్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్సీ)లో సదరం క్యాంప్ ఏర్పాటు చేయాలని ఆదివాసీ మిత్ర వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంకటేష్ కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెరమెరి, జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాల్లో అనేక మంది దివ్యాంగులు, మూగ, చెవిటివారు, వృద్ధులు ఉన్నారని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోవడంతో పాటు ఆన్లైన్లో సదరం స్లాట్ బుక్ చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోనే సదరం క్యాంప్ నిర్వహిస్తుండటంతో మారుమూల ఏజెన్సీ ప్రాంతాల దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు రవాణా సౌకర్యాల కొరత, ప్రయాణ ఖర్చులు భరించలేని పరిస్థితుల కారణంగా పలువురు దివ్యాంగులు సదరం ధ్రువీకరణ పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జైనూర్ సీహెచ్సీలో సదరం క్యాంప్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత దివ్యాంగులకు స్థానికంగానే వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని కోరారు.



# నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలి

- **రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, పునరావాస పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ రాజర్షిషా పాల్గొన్నారు. 2026–27 ఆర్థిక సంవత్సరంలో భూసేకరణకు రూ.6వేల కోట్ల వరకు నిధులు విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే రూ.2,550 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. విడుదలైన నిధులతో అవార్డులు జారీ చేసిన భూములకు పరిహారం చెల్లింపులను తక్షణమే పూర్తి చేయాలన్నారు. భూసేకరణకు ప్రత్యేక అధికారులను నియమించి, ప్రతి వారం పురోగతిపై సమీక్ష నిర్వహించాలని సూచించారు. రైతులతో నేరుగా చర్చించి, నిబంధనల ప్రకారం, మార్కెట్ విలువకు సాధ్యమైనంత త్వరగా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎస్ఎల్బీసీ సొరంగం పూర్తయ్యేలోపు పెండ్లిపాకల రిజర్వాయర్ పనులు పూర్తయ్యేలా భూసేకరణను ప్రాధాన్యతతో చేపట్టాలని ఆదేశించారు. సమస్యలు ఉంటే భూసేకరణ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. అవార్డులు జారీ చేసిన భూములకు పరిహారం చెల్లింపులను మొదటి ప్రాధాన్యతగా పూర్తి చేయాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులకు సంబంధించి సుమారు రూ.3,100 కోట్ల పనులను గుర్తించగా, రూ.2,514 కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్లో ఆర్డీఓ జగదీశ్వరావు, జెఈ ప్రశాంత్, ఏఓ వర్ణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

- **నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు**
- **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డీసీపీ ఎ.భాస్కర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, బెల్లంపల్లి సబ్కలెక్టర్ మనోజ్లతో కలిసి రహదారి భద్రతపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు క్షేత్రస్థాయిలో చర్యలను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. వాహనదారులు రహదారి భద్రతా నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించడంతో పాటు ఉల్లంఘనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ పరిధిలో అవసరమైన చోట్ల స్పీడ్ బ్రేకర్లు, రోడ్డు భద్రత సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రోడ్లపై చెత్త, ఇతర ఆటంకాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. రోడ్లపై అనధికారికంగా వాహనాల పార్కింగ్ను నియంత్రించాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. ఓవర్లోడ్ వాహనాలు, అతివేగ వాహనాలు, ఫిట్నెస్ లేని స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవాలని రవాణా శాఖకు సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించేలా కఠినంగా వ్యవహరించాలన్నారు. ఓవర్లోడింగ్, అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాంగ్సైడ్ డ్రైవింగ్పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. రోడ్లపై సంచరించే పశువులను గోశాలలకు తరలించాలని, నూతన గోశాల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం డీసీపీ భాస్కర్ మాట్లాడుతూ 2026 సంవత్సరంలో ఇప్పటివరకు జిల్లాలో 429 రోడ్డు ప్రమాదాలు జరగగా, 95 మంది మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నామన్నారు. బెల్లంపల్లి కన్నాల ప్రాంతం, నస్పూర్ కలెక్టరేట్ కమాన్ వద్ద రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం మాదక ద్రవ్యాల నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. మాదకద్రవ్య రహిత మంచిర్యాల జిల్లాగా తీర్చిదిద్దేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు 63 కేసులు నమోదు చేసి 133 మందిని అరెస్టు చేసినట్లు, 35 మందిని డీ-అడిక్షన్ కేంద్రాలకు తరలించి కౌన్సెలింగ్ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల విక్రయాలను అరికట్టాలని, మెడికల్ షాపులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యాసంస్థలకు వంద మీటర్ల పరిధిలో బెల్ట్ షాపులు, పొగాకు ఉత్పత్తుల విక్రయాలను నియంత్రించాలని తెలిపారు. విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై క్విజ్, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. గంజాయి సాగును గుర్తించి చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ముస్లిం స్మశాన వాటికలో అక్రమ దుకాణాలు తొలగించాలి

**ప్రజావాణిలో అధికారులకు ముస్లిం సోదరుల వినతి**



**ఉద్యమ కెరటం, మద్నూర్:** మద్నూర్ మండల కేంద్రంలోని నూతన బస్టాండ్ ఎదురుగా ఉన్న ముస్లిం స్మశాన వాటిక, ఈద్గా స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలు, షెడ్లను తొలగించి స్థలాన్ని పరిరక్షించాలని ముస్లిం సోదరులు అధికారులను కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. మద్నూర్ కేంద్రంలోని సర్వే నం.581లో 0.37 గుంటల స్మశాన వాటిక, ఈద్గా స్థలం ఉన్నట్లు తెలిపారు. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఈ స్థలంలో సుమారు 20 మంది దుకాణాలు, షెడ్లు ఏర్పాటు చేసి ఆక్రమించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొందరు నిర్మించుకున్న షెడ్లను ఇతరులకు అద్దెకు ఇచ్చి నెలనెలా ఆదాయం పొందుతున్నారని ఆరోపించారు.

**పలుమార్లు వినతులు ఇచ్చినా చర్యలు శూన్యం..**

స్మశాన వాటిక, ఈద్గా స్థలాన్ని పరిరక్షించాలని గతంలో పలుమార్లు తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాలు సమర్పించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలు, షెడ్లకు సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి నిబంధనల ప్రకారం తొలగింపు చర్యలు చేపట్టాలని కోరారు. ఇప్పటికే వక్ఫ్ బోర్డు సర్వేయర్, తహశీల్ కార్యాలయ సర్వేయర్లు సంయుక్తంగా స్థలాన్ని పరిశీలించి సర్వే నిర్వహించినట్లు తెలిపారు.హద్దులు నిర్ధారించి పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. సర్వే నం.581లోని స్థలాన్ని అధికారులు మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డుల ప్రకారం హద్దులను నిర్ధారించాలని ముస్లిం సోదరులు కోరారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం, బాన్సువాడ డివిజన్ అధికారుల దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లినట్లు తెలిపారు. అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేసి తొలగించడంతో పాటు భవిష్యత్తులో ఆక్రమణలకు అవకాశం లేకుండా పక్కా హద్దులు ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో మద్నూర్ జామా మస్జిద్ కమిటీ సదర్ ఏజాజ్ ఖాన్ అహ్మద్ పటేల్, రైస్ ఖాన్, అహ్మద్ ఖాన్, షేక్ ఆఫ్సర్, బషీర్ తదితరులు ఉన్నారు.

# 60 గ్రాముల గంజాయి స్వాధీనం..

**ఇద్దరి అరెస్ట్**

**ఉద్యమ కెరటం, గంభీరావుపేట్:** అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గంభీరావుపేట్ మండలం సముద్రలింగాపూర్ గ్రామ శివారులోని నాగంపేట కామన్ వద్ద గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పోలీసులను గమనించిన ఇద్దరు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించగా, వారిని వెంబడించి పెంట మనిశాంత్, బత్తిని సాయి కుమార్ లను అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీ చేయగా 60 గ్రాముల గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగానికి సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

# గీతంలో జాతీయ పోషకాహార వారోత్సవాలు

**ఫుడ్ టెక్నో ఫెస్ట్ –2026లో విద్యార్థుల సృజనాత్మకత**

**ఉద్యమ కెరటం, పటాన్చెరు:** గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ (జీఎస్ఎస్) లైఫ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ పోషకాహార వారోత్సవాలను పురస్కరించుకుని 'ఆహార శుద్ధి సాంకేతికతల ద్వారా పోషకాహార భవిష్యత్తును తీర్చిదిద్దడం' అనే ఇతివృత్తంతో 'ఫుడ్ టెక్నో ఫెస్ట్–2026' నిర్వహించారు. ఈ సందర్భంగా మైసూరులోని సీఎస్ఐఆర్–సీఎఫ్టీఆర్ఐ మాజీ డైరెక్టర్ డాక్టర్ శ్రీదేవి అన్నపూర్ణ సింగ్ 'ఆహార శుద్ధి ద్వారా ప్రపంచ పోషకాహార అవసరాలను తీర్చడం' అనే అంశంపై ప్రసంగించారు. సమతుల్య పోషకాహారం, ఆహార నిల్వ, ప్రత్యామ్నాయ ప్రోటీన్లు, విలువ జోడింపు, గట్ హెల్త్ తదితర అంశాల ప్రాధాన్యతను వివరించారు.హైదరాబాద్లోని మనే టెక్నికల్ డైరెక్టర్ (పరిశోధన, అభివృద్ధి) దేబాశిష్ మొహంతి వినియోగదారుల ఆధారిత ఉత్పత్తి వ్యూహాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు పోస్టర్ ప్రజెంటేషన్లు, నమూనాల తయారీ, వినూత్న ఆహార ఉత్పత్తి అభివృద్ధి పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమాన్ని డాక్టర్ జి. నిహారిక, డాక్టర్ ఎం. సురేంద్ర బాబు సమన్వయంతో నిర్వహించారు.

# బాలాజీనగర్లో ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో అన్నదానం

**ఉద్యమ కెరటం, కూకట్పల్లి ప్రతినిధి:** కూకట్పల్లి నియోజకవర్గ ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ వినోద్ ఆధ్వర్యంలో సోమవారం బాలాజీనగర్లో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు, బీజేపీ సీనియర్ నాయకులు జేకే శేఖర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, బీజేపీ సీనియర్ నాయకులు కాంతారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేకే శేఖర్ యాదవ్, కాంతారావు వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలకు, రైతులకు మేలు జరగాలని ఆకాంక్షించారు. రానున్న గ్రేటర్ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించి సైబరాబాద్ కార్పొరేషన్పై బీజేపీ జెండా ఎగురవేయాలనే లక్ష్యంతో కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలను నిరంతరం గుర్తించి, వాటి పరిష్కారం కోసం ప్రజల పక్షాన పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ కరుణశ్రీ, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సతీష్, ఉపాధ్యక్షులు యాదగిరి, ఎం. శ్రీనివాస్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ అనురాధ, సీనియర్ నాయకురాలు సుధారాణి, జిల్లా ఐటీ సెల్ కో-కన్వీనర్ రమేష్ యాదవ్, జిల్లా సెక్రటరీ రేణుక, జిల్లా ఆఫీస్ జాయింట్ సెక్రటరీ తేజస్విని, మల్కాజిగిరి ఓబీసీ మోర్చా మహిళా కన్వీనర్ దేవి తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**



# అన్యాయంపై రాజ్యాంగబద్ధ పోరాటం

- పౌర హక్కుల పరిరక్షణలో ఏపీసీఆర్ ముందంజ
- ఏపీసీఆర్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఉస్మాన్




సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ సీఆర్ రాష్ట్ర కార్యదర్శి ఉస్మాన్

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** దేశంలో అణిచివేతకు గురవుతున్న ప్రజల రక్షణ కోసం, వారి ప్రాథమిక హక్కుల పరిరక్షణ కొరకు అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ (ఏపీ సి ఆర్) నిరంతరం పనిచేస్తుందని ఆ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఉస్మాన్ తెలిపారు. సోమవారం కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని ఏ రోజ్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ జిల్లా శాఖ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సమాజంలో ఎక్కడ అన్యాయం జరిగినా ఏపీసీఆర్ బృందం వెంటనే స్పందించి, బాధితులకు న్యాయం దొరికేంత వరకు రాజ్యాంగబద్ధంగా పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. పౌర హక్కుల పరిరక్షణలో తమ అసోసియేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. దేశంలో మారుతున్న పరిణామాల దృష్ట్యా ప్రతి ఒక్కరూ చట్టాలు, తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, అందుకోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సంస్థ బలోపేతానికి కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అడ్హక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన బాధ్యులంతా జిల్లా వ్యాప్తంగా పౌర హక్కుల పరిరక్షణకు, అసోసియేషన్ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీసిఆర్ రాష్ట్ర కోఆర్డినేటర్ ఉమర్ ఫారూఖ్, మీడియా సెల్ ఇంచార్జ్ మొహమ్మద్ కలీం తదితరులు పాల్గొన్నారు.

### ఏపీసిఆర్ జిల్లా అడ్హక్ కమిటీని ఏకగ్రీవం ఎన్నిక

ముఖ్య సలహాదారులు గా అలీ బిన్ అహ్మద్, ఎండీ అహ్మద్, అబ్దుల్లా బిన్ అహ్మద్, అహ్మద్ బిన్ అబ్దుల్లా, జావిద్ గులాం, లీగల్ సలహాదారులుగా ఎండి రజి హైదర్, ఉబేద్ బీన్ యహియ, మునీర్ అహ్మద్, మొహమ్మద్ వికార్ ఉద్దీన్, జిల్లా ఇన్చార్జి గా అబ్దుల్ రహమాన్ , సలహాదారులు గా ఎండి సలీం, షబ్బీర్, సయ్యద్ నిసార్, అమర్ బీన్ అహ్మద్, మీర్జా సలీం బేగ్, షేక్ షాకీర్ , జిల్లా కోఆర్డినేటర్లు గా సయ్యద్ ఉబేద్ అలీ, అబ్దుల్ జమీల్, అసిస్టెంట్ కోఆర్డినేటర్లు గా అబ్దుల్ హన్నన్, అబ్దుల్ ముబాషిర్, ఎండి ఫయాజ్, హిదాయత్తుల్ల, మీర్ తాహిర్ అలీ, సాజిద్ ఖాన్, ఎండి అర్షద్ , పబ్లిసిటీ కార్యదర్శులుగా సయ్యద్ సోజర్, మోయిన్, కమిటీ సభ్యులు గా ఎండి ఇమ్రాన్, మున్వర్, అబ్దుల్ గఫార్, సయ్యద్ అజ్మీర్, అర్భాజ్ ఆలీ, సమీర్ ఖాన్, అఖిల్, అజ్హర్ హుస్సేన్, అబ్దుల్ హకీమ్, షారిక్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఏపీసీఆర్ జిల్లా ఇన్‌చార్జి అబ్దుల్ రహమాన్



# విదేశాల్లో ఆ ఇద్దరూ మెరుగుపడాలి

## సందీప్ పాటిల్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21 (ఉద్యమ కెరటం):** భారత క్రికెట్‌లో దూకుడైన బ్యాటింగ్‌తో ఆకట్టుకుంటున్న యువ ఆటగాళ్లు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీలపై మాజీ భారత ఆల్‌రౌండర్ సందీప్ పాటిల్ ప్రశంసలు కురిపించారు. ఇద్దరిలోనూ అద్భుతమైన ప్రతిభ, భారీ షాట్లు ఆడే సామర్థ్యం ఉందని పేర్కొన్నారు. అయితే విదేశీ పరిస్థితుల్లో తమ ఆటను మరింత మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. స్వదేశంలో బంతిని ఎదుర్కొనే సమయంలో అభిషేక్, వైభవ్ ఎంతో దూకుడుగా కనిపిస్తున్నారని పాటిల్ అన్నారు. అయితే బంతి స్వింగ్ అవుతున్న పరిస్థితుల్లో ఇద్దరూ కొంత ఇబ్బంది పడుతున్నట్లు కనిపించిందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఇంగ్లాండ్ పర్యటనలో ఈ విషయం స్పష్టమైందని చెప్పారు. విదేశీ పిచ్‌లపై పరిస్థితులకు అనుగుణంగా బ్యాటింగ్ శైలిని మార్చుకోవడం యువ ఆటగాళ్లకు ఎంతో ముఖ్యమని సూచించారు. జులైలో జరిగిన ఇంగ్లాండ్ టీ20 సిరీస్‌లో అభిషేక్ శర్మ ఐదు మ్యాచ్‌ల్లో 131 పరుగులు చేశాడు. అదే సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ టీ20ల్లో అరంగేట్రం చేసి మూడు మ్యాచ్‌ల్లో 42 పరుగులు సాధించాడు. స్వింగ్‌కు అనుకూలమైన పరిస్థితుల్లో వారి బ్యాటింగ్‌పై సందేహాలు వ్యక్తమైనప్పటికీ, ఆ తర్వాతి మ్యాచ్‌ల్లో ఇద్దరూ తమ సత్తాను చాటుకున్నారు. జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ ఆకట్టుకోగా, భారత్ సిరీస్‌ను 3–0తో కైవసం చేసుకున్న సమయంలో అతడు అత్యుత్తమ ఆటగాడిగా నిలిచాడు. మరోవైపు అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో అభిషేక్ శర్మ తన బ్యాటింగ్ సత్తాను మరోసారి చాటాడు. చివరి మ్యాచ్‌లో కేవలం 30 బంతుల్లోనే శతకం సాధించి సంచలనం సృష్టించాడు. అభిషేక్ నుంచి ఇలాంటి ఇన్నింగ్స్ రావడం తనకు ఆశ్చర్యం కలిగించలేదని పాటిల్ అన్నారు. ఆధునిక క్రికెట్‌లో యువ బ్యాటర్లకు తొలి బంతి నుంచే సహజమైన దూకుడుతో ఆడే స్వేచ్ఛ లభిస్తోందని, అభిషేక్, వైభవ్ ఆ అవకాశాన్ని సమర్థంగా ఉపయోగించుకుంటున్నారని ప్రశంసించారు. అయితే విదేశీ పర్యటనల్లోనూ అదే స్థాయిలో రాణించాలంటే స్వింగ్ అవుతున్న బంతులను ఎదుర్కొనే విషయంలో మరింత పట్టు సాధించాల్సిన అవసరం ఉందని సూచించారు.

# ఏషియన్ గేమ్స్‌లో సుచికా చరిత్ర

**హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఉద్యమ కెరటం):** ఏషియన్ గేమ్స్‌లో మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ విభాగంలో భారత క్రీడాకారిణి సుచికా తారియాల్ చరిత్ర సృష్టించింది. మహిళల ట్రెడిషనల్ 60 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించింది. ఏషియన్ గేమ్స్‌లో ఎంఎంఏకు తొలిసారి చోటు దక్కగా.. ఈ విభాగంలో భారత్‌కు తొలి పతకాన్ని అందించిన క్రీడాకారిణిగా సుచికా రికార్డు నెలకొల్పింది. సెమీఫైనల్లో సింగపూర్‌కు చెందిన హుయ్ హూన్ టియోతో సుచికా తలపడింది. హోరాహోరీగా సాగిన ఈ పోరు అదనపు సమయానికి వెళ్లింది. చివరికి స్వల్ప తేడాతో సుచికా ఓటమి పాలై ఫైనల్ అవకాశాన్ని కోల్పోయింది. అయితే అప్పటికే కాంస్య పతకం ఖరారైంది. అంతకుముందు క్వార్టర్‌ఫైనల్లో మంగోలియాకు చెందిన అల్టాన్‌చిమెగ్ బైగల్మాను 2–0తో ఓడించి భారత్‌కు ఎంఎంఏలో తొలి పతకాన్ని ఖాయం చేసింది. 36 ఏళ్ల సుచికా క్రీడా ప్రయాణం ఎంఎంఏకే పరిమితం కాలేదు. జాతీయస్థాయిలో జూడో క్రీడాకారిణిగా ఎదిగిన ఆమె 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొంది. 2023 ఏషియన్ గేమ్స్‌లో కురాష్‌లోనూ పోటీపడింది. అనంతరం జియూ–జిట్సులో రాణించి 2024లో ఫైటింగ్ జియూ–జిట్సు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. 2017లో ఎంఎంఏలో ప్రొఫెషనల్‌గా అరంగేట్రం చేసిన ఆమె.. ఇతర క్రీడలపై దృష్టి పెట్టడంతో కొంతకాలం ఎంఎంఏకు దూరంగా ఉంది. 2024లో మళ్లీ ఎంఎంఏలోకి అడుగుపెట్టి 'బ్రేవ్ కంబాట్ ఫెడరేషన్'తో ఒప్పందం చేసుకుంది. గాయాలు సహా పలు సవాళ్లను అధిగమించి తిరిగి పోటీల్లోకి వచ్చిన సుచికా.. ఇప్పుడు ఏషియన్ గేమ్స్‌లో భారత్‌కు చారిత్రక పతకాన్ని అందించింది. ఏషియన్ గేమ్స్‌లో ఎంఎంఏ తొలిసారి ప్రవేశించగానే భారత్‌కు పతకం రావడం విశేషంగా నిలిచింది.



# ఫాల్కన్స్ 'ఫస్ట్' ఫైట్.. సీపీఎల్ కిరీటం సొంతం!



- జమైకా కింగ్స్‌మెన్‌కు ఫైనల్లో షాక్
- 8 వికెట్ల తేడాతో ఫాల్కన్స్ ఘన విజయం
- సదాఖత్ 114 పరుగుల విధ్వంసం వృథా
- 4 వికెట్లతో మ్యాచ్‌ను తిప్పిన మొకీమ్
- మూడో సీజన్‌లోనే తొలి టైటిల్ ముద్దాడిన ఆంటిగ్వా

**బ్రిడ్జ్‌టౌన్, సెప్టెంబర్ 21 (ఉద్యమ కెరటం):** కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో ఆంటిగ్వా అండ్ బార్బుడా ఫాల్కన్స్ కొత్త చరిత్ర సృష్టించింది. కెన్సింగ్టన్ ఓవల్‌లో ఆదివారం రాత్రి జరిగిన 2026 ఫైనల్లో జమైకా కింగ్స్‌మెన్‌ను ఎనిమిది వికెట్ల తేడాతో చిత్తుచేసి తొలిసారి సీపీఎల్ కిరీటాన్ని ముద్దాడింది. 171 పరుగుల లక్ష్యాన్ని ఫాల్కన్స్ 16.4 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఫ్రాంచైజీగా మూడో సీజన్‌లోనే ఛాంపియన్‌గా నిలిచి సత్తా చాటింది.

### సదాఖత్ ఒంటరి పోరాటం

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన జమైకా కింగ్స్‌మెన్ నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 170 పరుగులు చేసింది. మాజ్ సదాఖత్ 58 బంతుల్లో ఎనిమిది ఫోర్లు, తొమ్మిది సిక్సర్లతో ఏకంగా 114 పరుగులు బాదాడు. సైమ్ అయూబ్ 29 పరుగులు చేయగా మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు. కిర్క్ మెకెంజీ, రోవ్‌మన్ పావెల్ సహా పలువురు ఖాతా తెరవకుండానే వెనుదిరిగారు. 30 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన కింగ్స్‌మెన్‌ను సదాఖత్, అయూబ్ ఆదుకున్నారు. మూడో వికెట్‌కు 80 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి స్కోరును 110 పరుగులకు చేర్చారు. ఈ దశలో ఫాల్కన్స్ స్పిన్నర్ సుఫ్యాన్ మొకీమ్ మ్యాచ్‌ను మలుపుతిప్పాడు. అయూబ్, పావెల్‌ను ఒకే ఓవర్‌లో పెవిలియన్‌కు పంపడంతో కింగ్స్‌మెన్ ఒక్కసారిగా కుప్పకూలింది. మొకీమ్ నాలుగు వికెట్లకు కేవలం 14 పరుగులిచ్చి ఫాల్కన్స్‌కు భారీ ఆధిక్యం అందించాడు.

### 171 లక్ష్యం.. 100 బంతుల్లోనే ఫినిష్

లక్ష్య ఛేదనలో రహ్‌కీమ్ కార్న్‌వాల్ తొలి ఓవర్‌లోనే రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో 20 పరుగులు రాబట్టి మెరుపు ఆరంభం ఇచ్చాడు. అయితే అదే ఓవర్ చివరి బంతికి ఔటయ్యాడు. అనంతరం ఎవిన్ లూయిస్, అమీర్ జంగూ రెండో వికెట్‌కు 64 పరుగులు జోడించారు. లూయిస్ 38 పరుగుల వద్ద వెనుదిరిగినా ఫాల్కన్స్ జోరుకు అడ్డుకట్ట పడలేదు. అమీర్ జంగూ, హసన్ నవాజ్ ఆ తర్వాత కింగ్స్‌మెన్ బౌలర్లకు మరో అవకాశం ఇవ్వలేదు. ఇద్దరూ మూడో వికెట్‌కు అజేయంగా 89 పరుగులు జోడించారు. జంగూ 57, హసన్ నవాజ్ 47 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. 16.4 ఓవర్లలో 173/2తో ఫాల్కన్స్ లక్ష్యాన్ని చేరుకుని మరో 20 బంతులు మిగిలుండగానే చారిత్రక విజయాన్ని అందుకుంది. నాలుగు వికెట్లతో ఫైనల్‌ను మలుపుతిప్పిన సుఫ్యాన్ మొకీమ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా, టోర్నీ మొత్తంలో రాణించిన షాదాబ్ ఖాన్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచారు. సదాఖత్ శతకం.. కింగ్స్‌మెన్ పోరాటం.. అన్నింటినీ అధిగమించిన ఫాల్కన్స్ చివరకు సీపీఎల్‌లో తమ తొలి కిరీటాన్ని ఎగరేసుకుపోయింది.

ఉద్యమ కెరటం

మంగళవారం
22 సెప్టెంబర్ 2026



## విడాకుల ప్రచారంపై నీతి టేలర్ స్పందన

హైదరాబాద్ సెప్టెంబరు 21 (ఉద్యమ కెరటం):తెలుగులో 'మేం వయసుకు వచ్చాం', 'పెళ్లి పుస్తకం' వంటి చిత్రాల్లో నటించి, అనంతరం హిందీ బుల్లితెరపై నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి నీతి టేలర్ తన వైవాహిక జీవితంపై వస్తున్న పుకార్లకు చెక్ పెట్టారు. 2020లో ఇండియన్ ఆర్మీ అధికారి పరిక్షిత్ బవాతో వివాహ బంధంలోకి అడుగుపెట్టిన ఆమె, గత కొంతకాలంగా భర్తతో విడాకులు తీసుకోబోతున్నారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. తన విడాకుల వార్తలపై స్పందిస్తూ, సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలు తమను పెద్దగా ప్రభావితం చేయవని నీతి టేలర్ స్పష్టం చేశారు. తమ బంధం గురించి తమకు పూర్తిగా తెలుసని, ప్రస్తుతం తామిద్దరం ఎంతో క్షేమంగా, సంతోషంగా వైవాహిక జీవితాన్ని కొనసాగిస్తున్నామని వెల్లడించారు. తమ దాంపత్య జీవితంపై ఇకనైనా దుష్ప్రచారాలు చేయడం నిలిపివేయాలని కోరారు. గతంలో పాల్గొన్న ఒక ఓటీటీ రియాలిటీ షోలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన చేదు అనుభవాలను నీతి పంచుకున్నారు. కెరీర్ ప్రారంభంలో ఒక మాజీ ప్రియుడు తనపై భౌతిక దాడికి దిగడంతో పాటు తీవ్రంగా హింసించాడని, ఆ భయానక బంధం నుంచి బయటపడి మానసికంగా కోలుకోవడానికి సమయం పట్టిందని తెలిపింది. ఆ చేదు జ్ఞాపకాల నుంచి బయటపడ్డాక పరిక్షిత్ తన జీవితంలోకి రావడం ఎంతో ప్రత్యేకమని, ప్రస్తుతం తన భర్తతో ఎంతో ఆనందంగా ఉన్నానని తెలపడంతో విడాకుల వార్తలకు ముగింపు పడింది.

## బోల్డ్ సీన్లపై రాధికా ఆప్టే కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్ సెప్టెంబరు 21 (ఉద్యమ కెరటం):** తెలుగులో 'లెజెండ్', 'లయన్' వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్న ప్రముఖ నటి రాధికా ఆప్టే, సినీ పరిశ్రమలో తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న కొన్ని చేదు అనుభవాలపై స్పందించారు. ఒకసారి బోల్డ్ సన్నివేశంలో నటిస్తే, ఇకపై ఎలాంటి సన్నివేశానికైనా సరే సమ్మతి తెలియజేస్తారనే అభిప్రాయం కొందరిలో ఏర్పడటం తనను తీవ్ర అసంతృప్తికి గురిచేసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నటిగా ప్రయాణంలో తన ఆలోచనా విధానం మారిందని, కథకు లేదా పాత్రకు అవసరం లేని సన్నివేశాలు చేయడానికి తాను ఇప్పుడు అంగీకరించనని స్పష్టం చేశారు. బోల్డ్ సన్నివేశాల విషయంలో కొందరు మేకర్స్ వ్యవహరించే తీరును ఆమె ఆక్షేపించారు. ఒక సీన్ కథకు ఎందుకు అవసరమో స్పష్టంగా వివరించకుండా, "ఇది కేవలం 15 సెకన్ల సన్నివేశమే కదా, చేసేయండి" అంటూ మాట్లాడటం ఆశ్చర్యం కలిగిస్తుందని పేర్కొన్నారు. ఒక నటికి సంబంధించిన సన్నివేశాన్ని కేవలం సెకన్ల వ్యవధితో కొలవడం సరైన విధానం కాదని ఆమె అభిప్రాయపడ్డారు. తన కెరీర్‌లో ఎదురైన మరో చేదు సంఘటనను గుర్తుచేసుకుంటూ, ఓ భారీ చిత్రంలో యాక్షన్ సన్నివేశం చిత్రీకరిస్తున్నప్పుడు షర్ట్ బటన్లు పూర్తిగా విప్పి నటించాలని తనపై ఒత్తిడి తెచ్చారని తెలిపారు. యాక్షన్ సన్నివేశానికి అలాంటి దుస్తులు ఎందుకు అవసరమని ప్రశ్నిస్తూ ఆ ప్రతిపాదనను తిరస్కరించినట్లు వెల్లడించారు. తనను ఆ విధంగా నటించమని కోరిన వ్యక్తి సినీ పరిశ్రమలో ఉన్నత స్థాయిలో ఉన్న ప్రముఖ వ్యక్తి అని, ఆయన పేరు బయటపెడితే చాలామంది ఆశ్చర్యపోతారని పేర్కొన్నారు. అయితే వ్యక్తిగతంగా ఎవరినీ లక్ష్యంగా చేసుకోవడం తన ఉద్దేశం కాదని రాధికా ఆప్టే స్పష్టం చేశారు.

## 'ది ప్యారడైజ్' ప్రీ రిలీజ్ వేడుకపై ఆసక్తి

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఉద్యమ కెటరం): నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో తెరకెక్కిన ప్రతిష్టాత్మక చిత్రం 'ది ప్యారడైజ్'. పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా ఎట్టకేలకు సెప్టెంబరు 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తెలుగు రాష్ట్రాల్లో సెప్టెంబరు 23 నుంచే ప్రత్యేక ప్రదర్శనలు ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఇప్పటికే చిత్రానికి సంబంధించిన సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. 'ఏ' ధ్రువపత్రం పొందిన ఈ సినిమా సుమారు 2 గంటల 49 నిమిషాల నిడివితో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన 'ఆయా షేర్', 'ఏషనాగుల' పాటలకు మంచి స్పందన రావడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. సెప్టెంబరు 21న హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించేందుకు చిత్రబృందం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యే అవకాశం ఉందనే వార్తలు టాలీవుడ్‌లో ఆసక్తిని పెంచుతున్నాయి. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రీ రిలీజ్ వేడుక అనంతరం నాని తన అభిమానులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నట్లు సమాచారం. దేశవ్యాప్తంగా సుమారు పదివేల మంది అభిమానులు ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. అభిమానుల కోసం ప్రత్యేకంగా భోజన ఏర్పాట్లు కూడా చేయనున్నట్లు సమాచారం. మరోవైపు 'ది ప్యారడైజ్'కు ట్రైలర్ విడుదల చేయకుండా నేరుగా థియేటర్లలోకి తీసుకురావాలని చిత్రబృందం నిర్ణయించినట్లు తెలుస్తోంది. కథ, కంటెంట్‌పై ఉన్న నమ్మకంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. సినిమాలో నాని సరసన కయాదు లోహర్ కథానాయికగా నటించింది. మోహన్‌బాబు 'మాలిక్' అనే కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన 'ఏషనాగుల' పాటలో కీర్తి సురేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.





## ఫోన్లు పక్కనపెట్టి మాట్లాడుకోండి: కాజల్

**హైదరాబాద్ సెప్టెంబరు 21 (ఉద్యమ కెరటం):** నేటి డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా ప్రభావం మనుషుల మధ్య బంధాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని ప్రముఖ నటి కాజల్ అగర్వాల్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా భార్యాభర్తలు ఒకేచోట ఉన్నప్పటికీ ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి తగినంత సమయం కేటాయించకపోవడం ఆందోళన కలిగించే విషయమని ఆమె పేర్కొన్నారు. భాగస్వామితో కలిసి బయటకు వెళ్లిన సమయంలో కూడా ఫోన్లలో మునిగిపోవడం వల్ల బంధాలలో కమ్యూనికేషన్ లోపించి దూరాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తన వ్యక్తిగత జీవితం గురించి చెబుతూ, తన భర్త గౌతమ్ కిచ్లూతో కలిసి వారానికి కనీసం ఒకరోజు డిన్నర్‌కు వెళ్తామని కాజల్ వెల్లడించారు. ఆ సమయంలో ఫోన్లను పూర్తిగా పక్కన పెట్టి కేవలం ఒకరితో ఒకరు సమయం గడపడానికి, ఆలోచనలను పంచుకోవడానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. వివాహ బంధంలో భాగస్వామి మాటలను వినడం, భావాలను పంచుకోవడం అత్యంత కీలకమని, డిజిటల్ ప్రపంచంలో నిరంతరం గడపడం కంటే చుట్టూ ఉన్న వ్యక్తులతో నేరుగా మాట్లాడటమే ముఖ్యమని ఆమె హితవు పలికారు. కాగా, కాజల్ అగర్వాల్ న్యాయవాది పాత్రలో నటించిన 'ది ఇండియా స్టోరీ' చిత్రం ఇటీవలే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో (ఓటీటీ) విడుదలైంది. ఆహార కల్తీ, వ్యవసాయంలో పురుగుమందుల వాడకం వంటి సామాజిక అంశాల నేపథ్యంలో ఈ చిత్రం రూపుదిద్దుకుంది.



Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**